



# విజయభాను

44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శనివారం 04-09-2021 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 305 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## పరిశ్రమలు తీసుకొచ్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

### కొనుగోలు చేసే శక్తి ప్రజలకు లేకపోతే పరిశ్రమలు మూతపడతాయి

### పరిశ్రమలకు ప్రోత్సాహకాలు విడుదల చేసిన సీఎం జగన్




అమరావతి : ఎంఎస్ఎంఈ, స్పిన్నింగ్, టెక్స్‌టైల్ పరిశ్రమలకు రూ.1,124 కోట్ల ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి ఈ నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, చిన్న తరహా పరిశ్రమలను ఆదుకునేందుకు నేడు శ్రీకారం చుట్టామని తెలిపారు. 10 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలు తెచ్చేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామని.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

**వరుసగా రెండో ఏడాది కూడా..**

కరోనా కష్టకాలంలో వరుసగా రెండో ఏడాది కూడా పరిశ్రమలకు ప్రోత్సాహక రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. కరోనా విపత్తు వల్ల రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ కూడా మూతపడకూడదన్న లక్ష్యంతో గత ఏడాది మే 22న దేశంలోనే తొలిసారిగా రీస్టార్ట్ ప్యాకేజీ పేరుతో రూ.1,100 కోట్ల ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పుడు కరోనా సెకండ్ వేవ్‌తో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిశ్రమలను ఆదుకునేందుకు ఈ ఏడాది కూడా ఎంఎస్ఎంఈలు, టెక్స్‌టైల్, స్పిన్నింగ్ మిల్లులకు రూ.1,124 కోట్ల ప్రోత్సాహకాలను అందిస్తోంది.

ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంక రవీంద్రనాథ్, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి, ఏపీఐడీసీ చైర్మన్ బండి పుణ్యశీల, ఏపీ మ్యారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జవ్వాది సుబ్రహ్మణ్యం, పరిశ్రమల శాఖ సలహాదారులు శ్రీధర్ లంక, రాజీవ్ కృష్ణ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుంటే.. టీడీపీ, ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎస్ఎంఈ, స్పిన్నింగ్, టెక్స్‌టైల్ పరిశ్రమలకు శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి రూ.1,124 కోట్ల ప్రోత్సాహకాల విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పరిశ్రమలు తీసుకొచ్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. పరిశ్రమలకు ప్రకటించిన రాయితీలన్నీ అమలు

తరువాయి 2లో..



రాష్ట్ర ముఖ్య మంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి MSME మరియు టెక్స్టైల్స్ పరిశ్రమలకు సంబంధించి ప్రోత్సాహకాల రాయితీలను నేరుగా లబ్ధి దారుల అకౌంట్ లో జమ చేశారు. విశాఖ జిల్లాలో ఎం ఎస్ ఎం ఈ పరిశ్రమల యూనిట్ లకు సంబంధించి రూ. 21,70,00,000/- లు ప్రోత్సాహకాలను లబ్దిదారులకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాస రావు, జిల్లా కలెక్టర్ డా ఏ మల్లిఖార్జున అందజేశారు.శాసన సభ్యులు గొల్ల బాబురావు, కరణం ధర్మశ్రీ, కే భాగ్య లక్ష్మి, జాయింట్ కలెక్టర్ పీ అరుణ్ బాబు ,DIC జనరల్ మేనేజర్ రామలింగరాజు పాల్గొన్నారు.

## అశోక్ గజపతి ధర్మకర్తనా.. అధర్మకర్తనా?

### ఆస్తులపై బహిరంగ చర్చకు ఎంపీ విజయసాయిరెడ్డి సవాల్



విశాఖపట్నం : టీడీపీ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు పై వైసీపీ పార్లమెంటరీ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి నిప్పులు చెరుగుతున్న విషయం తెలిసిందే. ఇక తాజాగా అశోక్ గజపతి రాజు ధర్మకర్తనా .. అధర్మకర్తనా అంటూ టార్గెట్ చేసిన విజయసాయి రెడ్డి మాన్సాస్ ట్రస్ట్, సింహాచలం దేవస్థానం ఆస్తుల దుర్వినియోగంపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. ఎక్కడ డిబేట్ పెట్టినా తాను రావడానికి సిద్ధంగా ఉన్నానని, నువ్వు సిద్ధమైతే రా అంటూ ఛాలెంజ్ చేశారు విజయ సాయిరెడ్డి.

దేవుడి ఆస్తులు కొల్లగొట్టడం లో అశోక్ గజపతిరాజు పాత్రపై అనుమానాలను వ్యక్తం చేసిన విజయసాయిరెడ్డి సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకున్న తర్వాత అశోక్ గజపతిరాజు ను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. మొదటి నుండి మాన్సాస్ ట్రస్ట్ వ్యవహారంపై సంచలన ఆరోపణలు చేస్తున్న సాయి రెడ్డి ఎనిమిది వందల నలభై ఎకరాల దేవస్థానం భూమి గత ప్రభుత్వ హయాంలో అన్యా క్రాంత మైనదని మండిపడ్డారు. దేవస్థానం భూములు అన్యాక్రాంతం అవుతుంటే ధర్మ కర్తలు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. 8 వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తి పరాధీనం పాలైతే ఏం చేస్తున్నారని నిలదీశారు.

ధర్మకర్తలు ధర్మానికి కట్టుబడి సంప్రదాయాలను కొనసాగిం చాలని స్పష్టం చేశారు. అశోక్ గజపతి రాజు బయటకు నీతులు చెబుతు న్నాడని లోపల కుట్రలు చేస్తున్నారని విజయసాయి రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకీ అశోక్ గజపతిరాజు ధర్మకర్త నా, లేకా అధర్మ కర్తనా అంటూ విరుచుకుపడిన సాయి రెడ్డి మాన్సాస్ ట్రస్ట్ లో అక్రమాలకు అశోక్ గజపతినే బాధ్యుడని విమర్శించారు.

తప్పు చేయకపోతే కోర్టుకు ఎందుకు వెళ్లారు అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు విజయ సాయిరెడ్డి. గత ప్రభుత్వ హయాంలో

తరువాయి 2లో..

## ఏపీ పోలీస్ శాఖకు 5 జాతీయ అవార్డులు

### : డీజీపీ గౌతమ్ సవాంగ్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖకు అయిదు జాతీయస్థాయి అవార్డులు వచ్చాయని డీజీపీ గౌతమ్ సవాంగ్ తెలిపారు. ఈ అయిదు అవార్డులు కూడా టెక్నాలజీ విభాగంలో వచ్చాయని వెల్లడించారు. ఈ రోజు ఏపీ పోలీసులు గర్వించదగ్గ రోజని పేర్కొన్నారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ద్వారా ఏపీ పోలీసు శాఖలోని సిబ్బంది ఆరోగ్య సమాచారమంతా పొందుపరచామని, దీనికి కూడా అవార్డు దక్కిందన్నారు. పాస్‌పోర్ట్ సేవలోనూ దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో ఉందని డీజీపీ తెలిపారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ టెక్నాలజీ సాయంతో చేస్తున్న విధానం జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలబెట్టిందన్నారు. గడిచిన రెండేళ్లలో ఇప్పటి వరకు 130 అవార్డులు ఏపీ పోలీస్ శాఖకి దక్కాయయని, ఈ అవార్డులు పోలీస్ శాఖపై మరింత బాద్యత పెంచాయని పేర్కొన్నారు. అవార్డులు పెరుగుతున్న కొద్దీ శాఖ పనితీరుని మరింతగా మెరుగుపరుచుకుంటున్నామన్నారు. కోవిడ్ సమయంలోఫేపీ పోలీస్ పనితీరు ప్రశంసలు అందుకుందని చెప్పారు. 'దిశ యాప్, మహిళల రక్షణపై ఏపీ పోలీసు శాఖకి ఇప్పటివరకు 17 అవార్డులు వచ్చాయి. మహిళల రక్షణ కోసం ఏపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందది. సీఎం వైఎస్ జగన్ దిశ యాప్ ప్రారంభించిన తర్వాత నుంచి రాష్ట్రంలో 46,66,841 మంది ఇప్పటి వరకు ఈ యాప్ డౌన్ లోడ్ చేశారు. దిశ యాప్‌తో మహిళలకి ధైర్యం వచ్చింది. దిశ యాప్‌తో అన్ని విధాల రక్షణ లభిస్తుందని మహిళలు భావిస్తున్నారు. రోజుకి 4 వేల వరకు కాల్స్ వస్తున్నాయి. దిశ యాప్ ఒక్కదానికే గతంలో మూడు జాతీయ అవార్డులు వచ్చాయి. పోలీస్ సేవా యాప్‌ను ఇప్పటి వరకు 7 లక్షల పైన డౌన్‌లోడ్ చేసుకున్నారు. పోలీస్ సేవా యాప్ ద్వారా ప్రజలకి ఎన్నో సేవలు అందిస్తున్నాం. పోలీస్ శాఖలో పారదర్శకతకి ఈ పోలీస్ సేవా యాప్ ద్వారా పెద్ద పీట వేస్తున్నాం. ప్రతీ సోమవారం అన్నిజిల్లాల ఎస్పీ కార్యాలయాలలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయడానికి మహిళలు ఎక్కువ సంఖ్యలో ముందుకు వస్తున్నారు. ఏపీలో స్పందన కార్యక్రమం ద్వారా 38 వేల ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాం' అని వెల్లడించారు.

## మాజీ సైనికులకు ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుంది



### విశాఖ బీచ్‌కు స్వర్ణ విజయ్ వర్ష్ జ్యోతి

### రక్షణ శాఖ మాజీ ఉద్యోగులకు రాయితీలు ఇస్తున్నట్లు వెల్లడి

### హోం మంత్రి సుచరిత

విశాఖపట్నం : మాజీ సైనికులకు ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుందని హోం మంత్రి సుచరిత తెలిపారు. రక్షణ శాఖ మాజీ ఉద్యోగులకు రాయితీ ద్వారా పరిశ్రమలు.. స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పాకిస్తాన్‌పై భారత్ విజయానికి సూచికగా చేపట్టిన స్వర్ణ విజయ్ వర్ష్ జ్యోతిని శుక్రవారం ఆర్కే బీచ్‌లోని విక్టరీ ఎట్ సీ వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తూర్పు నౌకదళ ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ అజెంద్ర బహదుర్ హోంమంత్రికి

తరువాయి 2లో..

## ఏపీలో కొత్తగా 1,520 కరోనా కేసులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గడిచిన 24 గంటల్లో ఏపీలో 64,739 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 1,520 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. గత 24 గంటలలో కరోనా బారిన పడి 10 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 13,887 కు చేరింది. గత 24 గంటల్లో 1,290 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 19,89,391 మంది ఏపీలో డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ శుక్రవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం 14,922 కరోనా కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య 2018200 కు చేరింది. ఏపీలో ఇప్పటి వరకు 2,68,09,774 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.






## నిర్దేశించిన లక్ష్యాల మేరకు వేగవంతంగా పనులు పూర్తి చేయాలి



విశాఖపట్నం : నవరత్నాలు - పేదలందరికి ఇళ్లు గృహ నిర్మాణాలకు సంబందించిన పనులను నిర్దేశించిన లక్ష్యాల మేరకు వేగవంతంగా పూర్తి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున సంబందిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుండి గృహ నిర్మాణ పనుల పై వారాంతపు సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కాబట్టి ఆరు నెలల్లో అన్ని లే అవుట్ లలో గ్రౌండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. పనుల అభివృద్ధి పై రానున్న నాలుగు రోజులలో ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే క్లియర్ చేయాలన్నారు. తేడాలు ఏమైనా జరిగితే సంబందిత అధికారులు, సిబ్బంది పై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎం.పి.డి.ఓ, డ్వామా, రెవెన్యూ, ఆర్ డబ్ల్యు ఎస్, ఇ.పి.డి.సి.ఎల్. శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిర్దిష్ట సమయంలో పనులను వేగవంతం చేయాలన్నారు. గృహ నిర్మాణ పనులకు సంబందించి ప్రతి వారం 10 శాతం ప్రోగ్రస్ కనపడాలన్నారు. గ్రౌండింగ్ చేసిన ప్రతి లేఅవుట్ లకు జియో ట్యాగింగ్ తప్పని సరి అని, ఈ నెల 5వ తేదిలోగా పూర్తి చేయాలన్నారు. ఇసుక సమస్య ఉంటే సంబందిత ఆర్ డి ఓ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, హౌసింగ్ పి.డి శ్రీనివాసరావు, డ్వామా పి.డి సందీప్, ఆర్ డబ్ల్యు ఎస్ ఇ రవికుమార్, జి.వి.ఎం .సి, ఎ.పి.ఇ.పి.డి.సి.ఎల్, మెప్మా, హౌసింగ్ అధికారులు హాజరైయారు.

## జిడిపి వృద్ధికి ఎంఎస్ఎంఇలు దోహదపడతాయి

**రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం**



శ్రీకాకుళం : రాష్ట్ర జిడిపి వృద్ధికి ఎంఎస్ంఇలు దోహదపడతాయని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారం పేర్కొన్నారు.

శుక్రవారం ఎంఎస్ఎంఇ, హేండ్లూమ్స్, స్పిన్నింగ్ మిల్స్ లకు ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ లో ఇన్సెంటివ్స్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న పరిశ్రమలకు ప్రభుత్వం సహకారం అవసరమన్నారు. ముఖ్యమంత్రి పెద్దమనసుతో ఎంఎస్ఎంఇలకు ఇప్పటి వరకు 2086.42 కోట్లు ప్రోత్సాకాలు ఇచ్చినట్లు చెప్పారు. 22, మే 2020 నెలలో ఎంఎస్ఎంఇలకు రీ స్టార్ట్ ప్యాకేజి కింద 450.27 కోట్లు, 29 జూన్, 2020లో ఎంఎస్ఎంఇలకు రీ స్టార్ట్ ప్యాకేజి కింద 453.64 కోట్లు, 29, జూన్, 2020న ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లకు 58.51 కోట్లు, 3, సెప్టెంబరు 2021న ఎంఎస్ఎంఇలకు 440 కోట్లు, 3, సెప్టెంబరు 2021న టెక్స్ టైల్స్ / స్పిన్నింగ్ మిల్స్ కు 684 కోట్ల రూపాయలు ఇచ్చినట్లు వివరించారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చట్టం తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.

చిన్న చిన్న పరిశ్రమలు ఇప్పటికే తమ ఉత్పత్తిని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాలకొండ శాసన సభ్యురాలు వి. కళావతి, తదితరులు పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణ పూర్తి చేసినవారికి సర్టిఫికేట్స్ పంపిణీ - ఐద్వా



ములగాడ : 58వ వార్డు గుల్లల పాలెంలో ఐద్వా ఆధ్వర్యంలో ఆసరా ట్రస్ట్ ఆరు మిషన్లు కోరమండల్ కంపిణీ ఆరు మిషన్లు సహకారంతో12కుట్టు మిషన్లు ఏర్పాటు చేసారు. వంద మంది కుట్టు సెంటర్లో శిక్షణ పొందారు. మూడు నెలలు శిక్షణ పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం ఆసరా ట్రస్ట్ చంద్ర మౌళి చేతులు మీద 50మందికి సర్టిపికేట్స్ అంద చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శిక్షణ పొందిన వారికి అభినందనలు తెలిపారు. మీరు పది మందికి నేర్పేవిధంగా ఎదగాలన్నారు. ఉపాధి కల్పనకు ఉపయో గపడాలన్నారు. అఖిల భారత ప్రజా తంత్ర మహిళా ఘంసం అధ్యక్ష,కార్యదర్శు బి.మమత,ఆర్ .విమల మాట్లాడుతు ఆసరా సంస్థ వారికి ధన్యవాదాలుతెలిపారు. ఈసర్టిఫికేట్స్ మన నైపుణ్యాన్ని గుర్తు చేస్తుందన్నారు. సచివాలయం కార్యదర్శి లోవరాజు మాట్లాడుతు ఐద్వా సంఘంవారు ,ఆసరా వారు చేస్తున్న మంచి కార్యక్రమానికి మహిళలు సపోర్టుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మళ. ఈశ్వరమ్మ, వరలక్ష్మి, కృణవేణి, తిరుమల, అరుణ, పొలమ్మ తదితర్లుపాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## పరిశ్రమలు తీసుకొచ్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

చేస్తున్నాం. కొనుగోలు చేసే శక్తి ప్రజలకు లేకపోతే పరిశ్రమలు మూతపడతాయి. 25 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు ఆపలేదు' అని సీఎం అన్నారు. ఎంఎస్ఎంఈలను ఆదుకునేందుకు, అదే రకంగా స్పిన్నింగ్ మిల్స్‌ను ఆదుకునేందుకు ఇవాళ ఈ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. తమకు తాము శ్రమ చేస్తూ మరో 10 మందికి ఉద్యోగాలు కల్పించే కార్యక్రమాన్ని ఎంస్ఎంఈలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 97,423 మంది ఎంఎస్ఎంఈలు నడుపుతున్నారని మరో 10 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని సీఎం అన్నారు.

"ఇలాంటి రంగాన్ని ఆదుకోవడం అంటే.. రాష్ట్రం ప్రభుత్వం ఒక మాట చెప్తే.. చేస్తుంది అని నమ్మకం కల్పించడం అంటే.. పరిశ్రమలను పెట్టడానికి విశ్వాసం కల్పించడమే. మధ్యతరహా పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేవారుసహా వీరందరినీ కాపాడగలిగితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కాపాడినట్టు అవుతుంది. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు కూడా జీడీపీకి దోహదపడతాయి. గతంలో మాదిరిగా హడావిడి ఎక్కువగా ఉంటేది. పెద్ద పెద్ద సదస్సులు పెట్టేవారు, కాగితాల మీద అగ్రిమెంట్లు పెట్టుకునేవారు, ఆ రోజుల్లో అక్కడ ఏమీ జరక్కముందే.. మైక్రోసాఫ్ట్ వచ్చేసింది.. ఎయిర్‌బస్ వచ్చేసింది అని మరో రోజు, బుల్లెట్ రైలు వచ్చేసిందని మరో రోజు ఇలా హెడ్‌లైన్స్ పెట్టి రాసేవారు. ఇటువంటి పరిస్థితులన్నీ కూడా పక్కనపెట్టి ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు చేయకుండా నిజంగానే పరిశ్రమలను తీసుకురావడానికి అడుగులు ముందుకేస్తున్నాం. పరిశ్రమలు ఎక్కడ వస్తున్నాయో.. మన కళ్లముందే కనిపిస్తున్నాయి. ఉద్యోగ అవకాశాలు కూడా మన కళ్లముందే కనిపిస్తున్నాయి. పరిశ్రమలు రావాలంటే... దానికి అనుకూల వాతావరణం ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇన్సెంటివ్ అనేదాన్ని చెప్తే.. దాన్ని ఇచ్చేలా ఉండాలి. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా కూడా పరిస్థితులను చూస్తే... ఆర్థిక వ్యవస్థ మందగమనం కనిపిస్తోంది. అనుకూలతలేని పరిస్థితులనుంచి కూడా ప్రజలను కాపాడుకోవాలి, ఒక వేళ డిమాండ్ తగ్గకుండా చూసుకుంటూ, మరోవైపు పరిశ్రమలను నిలబెట్టే కార్యక్రమాలు చేయాలి. ఇదే దిశగానే అడుగులు వేస్తూనే ముందుకు పోవడం జరుగుతుంది. పరిశ్రమలు రావడమే కాదు, కొనుగోలు శక్తి ప్రజలకు ఉన్నప్పుడే ఆ పరిశ్రమలు నిలబెడతాయి. అది లేకపోతే.. ఆ సైకిల్ దెబ్బతింటుంది, పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతాయి, మూతబడే పరిస్థితి ఉంటుంది. కోవిడ్ పరిస్థితుల్లో ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకే దాదాపు 22 సంక్షేమ అభివృద్ధి పథకాలను తీసుకు వచ్చాం. ఒక రూపాయి కూడా అవినీతి లేకుండా వివక్షకు ఆస్కారం ఇవ్వకుండా ప్రతి పేద లబ్ధిదారునికి డీబీటీ పద్ధతిలో వారి అక్కౌంట్లోకి వేస్తున్నాం. ఈ 27 నెలలకాలంలో మన ఇచ్చిన డబ్బు కుటీర, మధ్యతరహా పరిశ్రమలను నిలబెట్టగలిగాయి, అంతేకాకుండా ఉపాధిని నిలబెట్టడానికి ఉపయోగపడ్డాయి. ఇలాంటి కష్టకాలంలో కూడా ప్రజల కొనుగోలు శక్తి నిలబెట్టగలిగాం. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా మైనస్ 5శాతం ఉన్నప్పటికీ మన రాష్ట్రంలో అలాంటి పరిస్థితులకు ఆస్కారం లేకుండా మన రైతును, మన వెనకబడ్డ వారిని నిలబెట్టుకోగలిగాం. గ్రోత్‌రేట్ చిన్నదే అయినా నిలబెట్టుకోగలిగాం. అప్పోసప్పో చేసైనా సరే అందించిన డబ్బే ఒక రాష్ట్రానికైనా, దేశానికైనా సంజీవని అవుతుందని అంతర్జాతీయ ఆర్థిక వేత్తలు చెప్పినమాట. కాని దురదృష్టవశాత్తూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 లాంటివాళ్లు, తెలుగు దేశం పార్టీవాళ్లు..... ప్రజలను కాపాడుకునేందుకు అప్పోసప్పో చేసే కార్యక్రమాన్ని చేస్తే దాన్ని కూడా నెగెటివ్‌గా చూపించే అధ్వాన్న పరిస్థితులు మన రాష్ట్రంలో కనిపిస్తున్నాయి. వీళ్లు ఎలాంటి నెగెటివ్ కార్యక్రమాలు చేసినా.. దేవుడి దయతో మంచి చేయాలనుకున్న కార్యక్రమాలను చేస్తాం. పరిశ్రమలు, వాటిమీద ఆధారపడ్డ కుటుంబాలకు మరింత చేయూతనిస్తున్నాం. 12 లక్షలమందికి ఉపాధినిస్తున్న పరిశ్రమలకు చేయూతనిస్తున్నాం. ఎంఎస్ఎంఈలకు రూ.450 కోట్లు, టెక్స్‌టైల్ స్పిన్నింగ్‌మిల్స్‌కు రూ.684 కోట్లు నేరుగా వారి అక్కౌంట్లోకి వెళ్తాయి. 27 నెలలకాలంలోనే ఇప్పటివరకూ ఈ రంగాలకు ప్రభుత్వం అందించిన మొత్తం రూ.2,087 కోట్లు ఆసరా, చేయూత, తోడు లాంటి కార్యక్రమాలు కాకుండా ఇవి అదనంగా ఇచ్చాం. గత ప్రభుత్వం 2015 నుంచి ఎంఎస్ఎంఈలకు బకాయి పెట్టిన రూ.904 కోట్లు, సిన్నింగ్‌మిల్స్‌కు పెట్టిన రూ.684 కోట్లు మొత్తంగా రూ. 1,588కోట్ల బకాయిలను మన ప్రభుత్వం చెల్లిస్తోంది. లబ్ధిపొందుతున్న యూనిట్లలో 62శాతం ఎస్టీలు, ఎస్సీలు, బీసీలు ఉన్నారు. 42 శాతం యూనిట్లు అక్కచెల్లెమ్మలే ఉన్నారు. ప్రోత్సహకాలు ఇవ్వకపోతే వీళ్లు రోడ్డుమీద పడతారన్న ఆలోచన గత ప్రభుత్వం చేయలేకపోయింది. పరిశ్రమల్లో 75శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలంటూ చట్టంచేసిన ప్రభుత్వం మనది. ఇవే కాకుండా పారిశ్రామికంగా అడుగులు ముందుకేస్తున్నాం. వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో రూ.10వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడానికి 801 ఎకరాల్లో రూ.730 కోట్లతో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్‌యూనిట్లను రూపొందిస్తున్నాం. వచ్చే 2 ఏళ్లలోనే దాదాపు 30వేలమందికి ఉపాధి అవకాశాలు. వైఎస్సార్ నవోదయం కింద 1,08,292 ఎంఎస్ఎంఈ బ్యాంకు ఖాతాలకు చెందిన రూ.3,236 కోట్ల రూపాయలకు పైగా రుణాలను రీషెడ్యూల్ చేశాం. 2,49,591 ఎంస్ఎంఈ బ్యాంకు ఖాతాలకు అత్యవసర క్రెడిట్ లైన్ హామీ పథకం కింద బ్యాంకు రుణాలతో అదనపు వర్కింగ్ క్యాపిటల్‌ను ఏర్పాటు చేశాం. మన ప్రభుత్వం వచ్చినప్పటినుంచీ రూ.30,175 కోట్ల పెట్టుబడితో 68 భారీ, మెగా పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించాయి. దీనిద్వారా 46,199 మందికి ఉపాధి లభించిందని సీఎం వైఎస్ జగన్ అన్నారు.

## మాజీ సైనికులకు ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుంది

అందజేశారు. నాటి విజయంలో భాగస్వాములైన నేవీ సిబ్బందిని మంత్రి సత్కరించారు. స్వర్ణ విజయ్ వర్ష్ జ్యోతిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖలో నేవీ అవసరాలు తీర్చడానికి సీఎం జగన్మోహన్ రెడ్డి పూర్తిగా సహకరిస్తున్నారని తెఉలిపారు. భారత్ రక్షణలో విశాఖ తీరం కీలకమని మంత్రి అవంతి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సైనికులు నాటి యుద్ధ జ్ఞాపకాలని గుర్తు చేసుకున్నారు.

## అశోక్ గజపతి ధర్మకర్తనా.. అధర్మకర్తనా?

సింహగిరిపై అనేక అక్రమాలు జరిగాయని విమర్శించారు. త్వరలోనే పంచ గ్రామాల భూ సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని విజయ సాయి రెడ్డి పేర్కొన్నారు.

మహిళలపై అశోక్ గజపతి రాజుకు ఏమాత్రం గౌరవం ఉన్నా సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం పురుషులతో సమానంగా మహిళలకు అవకాశం కల్పించాలని విజయసాయి రెడ్డి డిమాండ్ చేశారు. సంచయిత గజపతిరాజుకు ట్రస్ట్ చైర్మన్ గా కొనసాగనివ్వాలని అభిప్రాయపడ్డారు . అశోక్ గజపతిరాజు నిజాయితీపరుడు అయితే కోర్టుకెళ్లి చైర్మన్ పదవి తెచ్చుకోవడం దేనికని విజయసాయి రెడ్డి ఎద్దేవా చేశారు. పంచ గ్రామాల సమస్య న్యాయ స్థానంలో ఉండడం వల్ల న్యాయ పరిధిలో త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేస్తామని విజయ సాయి రెడ్డి స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో 1124 కోట్ల ప్రోత్సాహకాలు

### వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి

### జిల్లా లో 653 మందికి 12.50 కోట్ల రూపాయలు విడుదల

శ్రీకాకుళం : రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం కల్పిస్తేనే పరిశ్రమల స్థాపనకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తారని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన తాడేపల్లి నుండి ఎంఎస్ఎంఇ, హేండ్లూమ్స్, స్పిన్నింగ్ మిల్స్ లకు ఇన్సెంటివ్స్ విడుదల కార్యక్రమంను జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 97 వేల 423 మంది చిన్న చిన్న పరిశ్రమలు పెట్టడమే కాకుండా వీరి ద్వారా 10 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలకు అనుకూలతలు ఉంటేనే పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తారన్నారు. పరిశ్రమల నుంచి ఉత్పత్తి అయ్యే వస్తువులు కొనుగోలు చేసే శక్తి ఆ ప్రాంతంలో ఉంటేనే ఆ పరిశ్రమ ముందుకు నడుస్తోందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అమలులో అవినీతి లేకుండా, పారదర్శకంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలోకి నేరుగా నగదు జమ చేయడంజరిగిందని తెలిపారు. ఎంఎస్ఎంఇ, హేండ్లూమ్స్, స్పిన్నింగ్ మిల్స్ లకు 1124 కోట్ల ప్రోత్సాహకాలు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు ఈ రంగానికి 2086.42 కోట్ల రూపాయలు ప్రోత్సాహకాలు ఇచ్చినట్లు చెప్పారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చట్టం తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న 9 తీరప్రాంతాల్లో ఫిషింగ్ హార్బర్ లు




ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫిషింగ్ హార్బర్ లు ఏర్పాటు చేస్తే ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా మన ప్రాంతాల్లో 76 వేల 236 మంది మత్స్య కారులు ఉపాధి దొరుకుతుందని చెప్పారు. భోగాపురంలో అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం పిపిపి పద్ధతిలో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 12.50 కోట్ల రూపాయలతో 653 మందికి లబ్ధిచేకూరుతుందని ముఖ్యమంత్రికి వివరించారు. ఇందులో తిరిగి ప్రారంభించే పరిశ్రమలు ఉన్నట్లు



చెప్పారు. జిల్లా నుండి రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన మజ్జి పార్వతి మాట్లాడుతూ ఒక కోటి 50 లక్షలను బ్యాంకులో లోన్ తీసుకొని ఒక బ్రిక్ ఇండస్ట్రీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్న మధ్య తరహా పరిశ్రమలు రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఎంఎస్ఎంఇ లకు ఇస్తున్న ప్రోత్సాహకం చిన్న పరిశ్రమలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో ఎంతగానో ఆదుకున్నారని తెలిపారు. ఇండస్ట్రీలో పనిచేస్తున్న కార్మికులందరికి నవరత్నాలలోని ప్రభుత్వ పథకాలైన అమ్మ ఒడి, ఆసరా, తదితర పథకాలు అందుతున్నాయని చెబుతున్నట్లు ఆమె వివరించారు. ఈ సమావేశంలో శాసన సభాపతి తమ్మినేని సీతారాం, పాలకొండ శాసన సభ్యురాలు వి. కళావతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. శ్రీరాములు నాయుడు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు పింఛన్లు అందజేయలేని చేతగాని వైకాపా ప్రభుత్వం

**-విశాఖ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు సీతారాం**



ములగాడ : గత తెదేపా ప్రభుత్వం లో నిరుపేదలకు అందించే సామజిక భరోసా పింఛన్లను ఇప్పటి వైకాపా ప్రభుత్వం సక్రమంగా అందించక పోవడం దారుణమని విశాఖ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు సీతరాం మండిపడ్డారు. జీవీఎంసీ జోన్ -5 కార్యాలయంలో విశాఖ పశ్చిమనియోజకవర్గం పారిశ్రామికప్రాంతం టీడీపీ నాయకులు జోనల్ కమిషనర్ ని మర్యాద పూర్వకముగా కలిసి నూతన పెన్షన్ విధానానికి నిరసనగా విశాఖ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు సీతరాం ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పాలన సమయంలో పెద్ద ఎత్తున ప్రాముఖ్యత కల్పిస్తూ పెన్షన్ దారులకు ప్రధాన గుర్తింపు ఇస్తూ 3 నెలలకు గాను ఒక్కసారి తీసుకునే అవకాశం కల్పించిన విధానాన్ని రద్దు చేస్తూ ఏ నెల పెన్షన్ ఆ నెలలోనే తీసుకోపోతే రద్దు అయ్యే విధంగా జి ఓ జరిచేస్తూ వైస్సార్సీపీ ప్రభుత్వం మరోసారి పేద బడుగు బలహీన వర్గాల పై తమ నిర్లక్ష్యం చూపడం ఎంతో బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు చిలకపలుకులు పలికిన వైయస్సార్ పార్టీ, ముఖ్యమంత్రి జగన్, వారి నాయకులు ఈ రోజు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఎందుకు ఇటువంటి నిర్ణయాలను స్వాగతిస్తున్నారని ప్రశ్నిస్తూ తెదేపా నాయకులు నిరసన తెలియజేశారు. ఇది పూర్తిగా పింఛన్లు ఇవ్వకుండా ఎగ్గొటే విధానానికి నాంది అని విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో 58వ వార్డ్ టీడీపీ అద్యక్షులు కోరాడ శ్రీనివాసరావు, నీలాపు జోగి, 58వ వార్డు టీడీపీ ప్రధానకార్యదర్శి పోతాబత్తుల శ్రీనివాసరావు,ఆర్ ఆర్ రాజు, పినపోతు కిషోర్ నాయకర్, సూరిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## 6 నుంచి గీతం ఉచిత ఫిజియోథెరపి శిబిరం

సాగర్‌నగర్ : కోవిడ్-19 మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా అన్ని వయస్సుల వారిని శారీరకంగా ఎంతో ఇబ్బందులకు గురి చేస్తున్న నేపద్యంలో కోవిడ్-19 బారిన పడి చికిత్స ద్వారా బయటపడిన తరువాత కూడా శారీరకంగా కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్న వారికి గీతం "ఫిజియోథెరపీ" విభాగం ఉచిత సలహ సహయ శిబిరాన్ని సెప్టెంబర్ 6వ తేది నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నదని ఫిజియోథెరపి విభాగం డైరక్టర్ డాక్టర్ మాధురి కాశీ తెలిపారు. ఈ శిబిరం 6,7 తేదీలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం-4గంటలు వరకు ఉంటుందని, 8వ తేదిన ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని ఆమె తెలిపారు. గీతం ఆసుపత్రి ఆవణంలోని "ఫిజియోథెరపి" విభాగం వద్ద ఒపిడిలో ఈ ఉచిత శిబిరం నిర్వహించబడుతుందన్నారు. కోవిడ్-19 బారిన పడి శ్వాస సమస్యలు, అలసట, నిస్తేజంగా ఉండడం వంటి ఇబ్బందులు ఉన్న వారికి సలహాలు ఇవ్వబడతాయి అని, కోవిడ్-19 తరువాత ఆరోగ్యం ఎలా ఉందో అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి కోవిడ్-19 బాధితునికి వయస్సు, కోలుకున్న తరువాత ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి వారి కోసం ప్రత్యేకించి వ్యాయామం, చిన్న పాటి అనుసరించతగ్గ ఫిజియోథెరపి సలహాలుఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ ఉచిత అవగాహన శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి వ్యక్తిగతంగా కౌన్సిలింగ్ నిర్వహించి ఫిజియోథెరపి సంబంధ సూచనలు చేయడం జరుగును. ఈ ఉచిత శిబిరం కేవలం కోవిడ్-19 నుంచి కోలుకున్న వారికి మాత్రమేనని పాల్గొనదలచిన వారు ఫోన్ నెంబరు.0891-2866588 లో సంప్రదించాలని సూచించారు.

## సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికుల దీక్షలు

గాజువాక : జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జివిఎంసి గాజువాక జోన్ - 6, జోనల్ ఆఫీసు వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు జి. సుబ్బారావు, ఎం రాంబాబు పాల్గొని మాట్లాడుతూ. 11వ పి ఆర్ సి - సమాన వేతనాలు అమలు చేయాలని, ఆప్కాస్ వద్దు,పర్మినెంట్ కావాలని డిమాండ్ చేశారు. ఏపీ, సీఎం, జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, 60 సంవత్సరాలు దాటిన వారు చనిపోయిన వారు స్థానంలో వాళ్ల కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశం కల్పించాలని, నేటికీ గాలి లొ ఉన్న అప్కోస్ లోనూ విలియం కానీ వారికి 5 నెలలు జీతాలు 12 నెలలు హెల్త్ అలవెన్స్ బకాయి చెల్లించాలని, , పర్మినెంటు చేశాకే, సచివాలయాలకు బదలాయించాలని, డ్రైవర్లు, యూజీడీ, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్సు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని యెడల పోరాటాన్ని ఉదృతం చేస్తామని హెచ్చించారు. ఈ దీక్షలో గొలగాని అప్పారావు, నాగరాజు,గణేష్, రాము, మీనాక్షి,, బాలరాజు,, రాణి, వెంకటలక్ష్మి పెంటయ్య, వరహాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి

## తెలుగుదేశం పార్టీ డిమాండ్



పాడేరు : తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు అర్హులం దరికీ పింఛన్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఎం.పీ.డీ.ఓకు రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు ఆధ్వర్యంలో వినతి పత్రం అందించడం జరిగింది. ఇందులో భాగంగా టీడీపి నాయకులు మాట్లా డుతూ అర్హులందరికి పింఛను వచ్చేలా చూడాలని, కుంటి సాకులతో అనర్హత వేటు వేయడం ప్రభుత్వానికి తగదని వారన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ జిల్లా అధికార ప్రతినిధి గంగ పూజారి శివకుమార్, యువ నాయకులు కోడా వెంకట సురేష్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కొట్టగుల్లి రమేష్ నాయుడు, బుద్ధ జ్యోతి కిరణ్, వర్తన నీలకంఠం, బాలకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి

## - ఎమ్మెల్యే అధీప్‌రాజ్



సబ్బవరం : సబ్బవరం మూడు రోడ్ల కూడలి లో ఉన్న ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే అదీప్ రాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా గురువారము ఎమ్మెల్యే అధీప్ రాజు మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వచ్చిన వ్యక్తి అన్నారు ప్రజల కొరకు రాజశేఖర్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు.ఉచిత విద్యుత్ విద్యార్థుల కొరకు ఫీజు రియంబర్స్మెంట్ తదితర కార్యక్రమాలు చేపట్టారన్నారు ఆయన తనయుడు జగన్మోహన్ రెడ్డి ఆయన బాటలో నడుస్తున్న అన్నారు అంతేకాకుండా అనేక సంక్షేమ కార్య క్రమాలు చేపడుతున్నారు భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయ డానికి కార్య క్రమాలు చేస్తున్నా రన్నారు. ప్రతిపక్షాల వారు దాకా ప్రసారాలు చేస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు లో నూటికి నూరు శాతం చేశారన్నారు నవరత్న పథకాలు అమలు చేశారన్నారు అవే కాకుండా పథకాలను అమలు చేశారన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు కోటాన రాము, తుంపాల అప్పారావు ఎస్ నారాయణ మూర్తి ఎస్ ముత్యాల నాయుడు వడ్డాది అప్పలరాజు మనం అచ్చంనాయడు కాపు శెట్టి శేషుబాబు పల్ల కృష్ణ కర్రీ బాబు సబ్బవరపు సత్యనారాయణ బుజ్జి ఇతరాలు పాల్గొన్నారు మండల వైసీపీ అధ్యక్షరాలు బంతికోళ్ళ పద్మ దెడ్డం పద్మ పాల్గొన్నారు.

# యువతకు అదర్శం పైల హరేష్

## హరేష్ జన్మదిన వేడుకుల్లో శ్రీనువాస్



పరవాడ : యువతకు అదర్శము పైలహరేష్ అని వైసిపి సిఇసి సభ్యులు పైల శ్రీనువాస్ రావూ అన్నారు. గురువారం పరవాడ వై.సి.పి పార్టీ కార్యాలయంలో పెందుర్తి నియోజకవర్గ అగ్రిగోల్డ బాధితుల బాసట కమిటీ కన్వీనర్ మరియు పి యమ్ సి చైర్మన్ పైల హరీష్ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర సి ఇ సి సభ్యులు పైల శ్రీనివాసరావు పాల్గొని కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లడుతూ పైల హరేష్ ఇటువంటి జన్మదిన వేడుకులు మరిన్నీ జరిపికోవాలి అని అయన కోరారు.రాజకీయాల్లో ఉత్స హంగా పనిచేసే యువ నాయకుడు పైల హరేష్ అని అన్నారు. వైసిపి పార్టి అవిర్భావం నుండి అయన వైసిపి పార్టిలో ఉత్సహంగా పని చేస్తున్నారు అన్నారు. రానున్న రోజుల్లో మరిన్నీ ఉన్నతపథవులు పొందాలి అని అయన అకాక్షిం చారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు గారు, పెందుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పైల జూనియర్ అప్పల నాయుడు, ఉప సర్పంచ్ బండారు రామా రావు, పి.బోనంగి సర్పంచ్ బండారు కల్పనా రాజశేఖర్, , కూండ్రపు వరలక్ష్మి సీతా రామయ్య, కోన రామారావు, గొర్లి గోపి, బొద్దపు రమణ,పల్లా అప్పారావు,వార్డు మెంబర్లు గండి ఈశ్వరరావు, పోతల అప్పల నాయుడు,వై.యస్.ఆర్ సి పి నాయకలు పైల అప్పలనాయుడు, పైల పైడింనాయుడు పరవాడ మండలంలో గల సర్పంచ్ లు,బొంకుల దిబ్బ యూత్ సభ్యులు , పైల హరీష్ అభిమానులు పాల్గొన్నారు.

# విశ్వవిద్యాలయంలో విద్యార్థుల కొరకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం : సూర్య ప్రకాష్




సబ్బవరం: జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం లో క్లాట్-2021 ఎల్ఎల్ఎంలో ప్రవేశం పొందిన విద్యార్థుల తరగతులు నేడు ప్రారంభ మయ్యాయి. మొదటి రోజు విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమము విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. ఎస్.సూర్యప్రకాష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమకు ముఖ్య అతిధి గా రాజీవ్ గాంధీ నేషనల్ లా యూనివర్సిటి, పాటియాల ఉపకులపతి ప్రొ భాజపాయ్ ముఖ్య అతిధిగా గౌరవ ఉపన్యాసం అందిచారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. ఎస్.సూర్య ప్రకాష్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం విద్యార్థుల సౌకర్యం కోసం అన్ని సౌకర్యాలు సమకూరుస్తుందని, ముఖ్యంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయి లో పరిశోధన కు అవసరమైన ఇ-జర్నల్, మరియు లైబ్రరీ సదుపాయం ఉన్నదని ప్రతి సంవత్సరం 70 లక్షల రూపాయల వరకు అందుకోసం ఖర్చు చేస్తున్నా మని విద్యార్థులు ఉపయోగించు కొని తమ పరిశోధనా పటిమ ను పెంచు కోవాలని తెలిపారు. ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఎల్ఎల్ఎం కోర్సు అంటే ఎక్కువ పరిశోధన పద్ధతుల నేర్చు కొనేందుకు ఎక్కువ దృష్టి పెట్టాలని సూచిస్తూ, అలాగే టీచింగ్ ఎలా చెయ్యాలో అనేదానిని నేర్చుకోవాలని, ఎల్ఎల్ఎం స్థాయి లో అదేవిధంగా బోధన కూడా ఉండాలని తెలుపుతూ, నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థుల ను అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెజిస్ట్రార్ ప్రొ. కె. మధుసూదన్ రావు, అకాడమిక్ డైరెక్టర్ దయానంద మూర్తి, అధ్యాపకులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని మృతదేహం

కంచరపాలెం : సింహాచలం రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని మృతదేహన్ని రైల్వే పోలీసు లు శుక్రవారం గుర్తించారు. ఈ మేరకు మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటాయని రైల్వే ఎస్ఐ టి.కామేశ్వరావు తెలిపారు. మృతుడు నలుపు రంగు అఫ్ ప్యాంట్ దరించి వున్నాడని మృతుని కుడి బుజం ఓం అనే పచ్చ బొట్టు ఉందని తెలిపారు.

మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసు లకు సమాచారమివ్వాలని కోరారు.

## జగనన్న పల్లెబాటలో

# ఆకర్షణీయంగా పోషకాహార స్టాల్స్

## కోటఉరట్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిడిపిఓ అరుణకుమారి



స్టాల్స్ ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్, సిడిపిఓ అరుణకుమారి, సూపర్వైజర్ ప్రమీల తదితరులు

విశాఖపట్నం జిల్లా (నర్సీపట్నం) : పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మాకవర పాలెం మండలం గిడుతూరు సెక్టార్ బయ్యవరం గ్రామంలో ఏర్పాటు చేసిన స్టాల్ ను ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చూసి ముచ్చట పడ్డారు.జగనన్న పల్లెబాట కార్య క్రమంలో భాగంగా కోటవురట్ల సిడిపిఓ అరుణకుమారి ఏర్పాటు చేయించిన పోషకాహారం స్టాల్ ను ఆయన పరిశీలన చేశారు. తక్కువ ఖర్చుతో గ్రామీణ ప్రాంతంలో ఈ విధంగా తయారు చేయించుకోవడం పై ఐసీడీఎస్ వారు చేస్తున్న క్రుషి కి ఆయన ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.దీనికి ముందు మల్లవరం గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త ఒక్కరే స్టాల్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలలో గ్రామ సర్పంచ్ లు, మండల స్థాయి అధి కారులు, వైఎస్ఆర్సిపి నాయ కులు, సూపర్వైజర్ ప్రమీల, అంగ న్వాడీ కార్య కర్తలు గీతారత్నం, రవణమ్మ విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లిలో నకిలీ ఎస్ఐ అరెస్ట్



అనకాపల్లి : ఎస్ఐ ని అంటూ చలామణి అవుతున్న 26 సం,, యువకుడును అనకాపల్లి పోలీసులు అరెస్టు చేసారు. కేసుకు సంబంధించి అనకాపల్లి ఎస్ఐ ధనుంజయ మీడియాతో మాట్లాడుతూ, విధి నిర్వహణలో భాగంగా రింగ్ రోడ్డు జంక్షన్ లో వాహనాలు తనిఖీ చేయగా, ఒక వ్యక్తి తను ఎస్ఐ అని ఐడీ కార్డు చూపించడంతో అనుమానమొచ్చి తమదైన శైలిలో విచారించగా నకిలీగా తేలిందని అన్నారు.

నిందితుడు చీడికాడ మం,, వీరభద్ర రావు పేటకు చెందిన,పూడి మహేష్ , అలియాస్,మత్యరాజు గత కొంత కాలంగా తను ఎస్ఐ అంటూ చెలామణి అవుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించిన ఐడి కార్డులు శ్రీనిధి ఇంటర్నెట్ సెంటర్ చోడవరంలో తయారు చేసినట్టు విచారణలో తేలిందన్నారు , నిందితుడుపై పలు సెక్షన్ ల క్రింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని మీడియాకు తెలిపారు.

# సింహగిరి పై ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

- లక్ష్మీ నారాయణ వ్రతాలు మరియు లక్ష కుంకుమార్చన
- ప్రత్యేక ఆకర్షణగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు





సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు లక్ష్మీ నారాయణ వ్రతాలు మరియు లక్ష కుంకుమార్చన దేవస్థానం అధికారులు వైదికుల ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమాలలో భారీగా భక్తులు పాల్గొని అమ్మవారి కి పూజలు జరిపి ఆశీర్వాదం స్వీకరించారు ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని అమ్మవారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా సింహగిరి పై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నృత్య సేవలో భాగంగా గాలిగొపురం పక్కన గల సాంస్కృతిక కళా వేదికపై ఉదయం మరియు సాయంత్రము సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని శ్రావణ మాస తిరువీధి కార్యక్రమం నిర్వహించారు.



# భారత కిసాన్ రైతు డిమాండ్స్‌డే వారోత్సవాలు



వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ : గొలుగొండ మండలం తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో భారత కిసాన్ రైతు డిమాండ్స్‌డే వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మేకా సత్యనారాయణ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో పరిపాలన చేస్తున్న బిజెపి పాలకులు నరేంద్రమోదీ రైతులకు వ్యతిరేక నల్లచట్టాలు తీసుకొని రావడం ద్వారా ఢిల్లీ కేంద్రంలో సంవత్సరకాలం నుండి రైతుల ప్రాణాల సైతం పణంగా పెట్టి అలుపెరగని ఉద్యమాలు చేస్తున్నారన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. కేంద్రం పాలన కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించకపోవడం విచారకరమన్నారు. రైతుభరోసా ఇవ్వడం ద్వారా రైతులు బతుకులు మారిపోవన్నారు.

రైతుకు విత్తనాలు నాణ్యమైన ఇవ్వాలన్నారు. ఎరువులు సబ్సిడి ఇచ్చి నాణ్యమైనవి ఇవ్వాలన్నారు. బ్యాంక్‌ల ద్వారా పావలావడ్డీకి రుణాలు ఇప్పించాలన్నారు. రైతు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలన్నారు. కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్లచట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మర్రి అప్పలనాయుడు, కిల్లాడ రాంబాబు, సుర్ల శ్రీరామ్మూర్తి, పట్నాల గంగిబాబు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## కష్టం నేర్పిన క్రమశిక్షణ

'మేధో చర్చలు లేదా, హేతుబద్ధత ద్వారా క్రమశిక్షణ రాదు. కష్టకాలంలో మాత్రమే అది అలవడుతుంది' అన్నాడు మహాత్మా గాంధీ. 'స్వాతంత్ర్యం అంటే స్వీయ క్రమశిక్షణ పాటించడం, స్వచ్ఛందంగా చట్టబద్ధ పాలనను ఆమోదించడం' అని కూడా గాంధీ బోధించాడు. 'కరోనా కష్టకాలం'లో వినాయక చవితి పండుగను అత్యంత క్రమశిక్షణతో జరుపుకున్నందుకు ప్రజలు అభినందనీయులు. కరోనా సందర్భంగా సామూహిక కార్యక్రమాలు చేపట్టవద్దని, ఇళ్ళలోనే జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి ప్రజలు సానుకూలంగా స్పందించారు, స్వచ్ఛందంగా అమలు చేశారు. ఇది తెలంగాణ సమాజం మనో నిబ్బరతనే కాదు, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ద్వైదీభావన లేదనే వాస్తవాన్ని కూడా ఎత్తి చూపుతున్నది.

గణేశ నవరాత్రి ఉత్సవాలు వచ్చాయంటే చాలు భాగ్యనగరంతో సహా తెలంగాణవ్యాప్తంగా ఎంత కోలాహలం ఉంటుంది! ప్రత్యేకించి యువకులు, పిల్లలు సమష్టిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటారు. కానీ ఈ వినాయక చవితినాడు కాలనీలలోనే కాదు, అపార్ట్‌మెంట్‌లలో కూడా పిల్లలు గుమిగూడకుండా జాగ్రత్తలు పాటించారు. స్వాతంత్ర్య సమరంలో ప్రజలలో సమష్టి స్ఫూర్తి రగిలించి కదలిక తేవడానికి గణేశ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మహారాష్ట్రలో ప్రారంభమైన ఈ ఉత్సవాలను అతి సులభంగా తెలంగాణ సమాజం స్వీకరించడానికి కారణం ఇక్కడి ప్రజల స్వభావమే. బతుకమ్మ, దసరా వంటి ఏ పండుగనైనా సామూహికంగా జరుపుకోవడం తెలంగాణ ప్రజల అలవాటు. పండుగల సందర్భంగా ఫలహారాలు ఇచ్చిపుచ్చుకుంటారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొంటారు. కలివిడి సంస్కృతి ఇంత బలంగా నాటుకుపోయిన సమాజం ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితిని అర్థం చేసుకొని నిబ్బరంగా ఇంటికే పరిమితమై పండుగ జరుపుకోవడం విశేషమే.

సంస్కృతీ సంప్రదాయాలు నెలకొనడం వెనుక సమాజ అవసరాలు, హేతుబద్ధత ఉంటాయనే అవగాహన ఉన్నప్పుడు, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవాలనే స్పృహ కూడా ఏర్పడుతుంది. కరోనా ఇంకా మనలను వెంటాడుతూనే ఉన్నది. మనం అవలంబించే స్వీయ క్రమశిక్షణే కరోనాను అంతం చేయగల ఏకైక ఆయుధం. ప్రజలు ఇదే రీతిలో క్రమశిక్షణను పాటిస్తూ ఉంటే కరోనా జాడ లేకుండా పోతుంది.

బతుకమ్మ, దసరా పండుగలు ఎంతో దూరంలో లేవు. తెలంగాణ సమాజమంతా నియమబద్ధంగా ఉండి అతి తొందరగా కరోనా వైరస్‌ను నిర్మూలిద్దామంటూ దీక్ష బూనాలి. బతుకమ్మ, దసరా, దీపావళి మొదలుకొని పండగలన్నీ మళ్ళీ సామూహికంగా మరింత సంబరంగా జరుపుకొనే మంచి రోజులు త్వరలోనే వస్తాయని ఆశిద్దాం.

## సీజన్ వ్యాధులపై ఇంటింటా సర్వే ...



కంచరపాలెం : సీజన్ వ్యాధులపై సచివాలయం సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టారు . ఈమేరకు జీవీఎంసీ 53 వ వార్డు పరిధి పార్వతీ నగర్ , గ్రీన్ గార్డెన్స్ , జాకీర్ హుస్సేన్ నగర్ తదితర ప్రాంతల్లో 295 సచివాలయం టౌన్ ప్లానింగ్ కార్యదర్శి గణేష్ శుక్రవారం సర్వే నిర్వహించారు . ఇంటి ఆవరణలో సర్వే కు సంబందించి గోడ పత్రికను అతికించారు . " ఏ .ఎల్ .ఓ " అపరేషన్ లో బాగంగా వాదానికి ఒక సారి సచివాలయం పరిధి లో ప్రతి ఇంట్లో పరిశరాలను పరిశీలించడంతో పాటుగా ఇంట్లో ఎవరైన ఆనారోగ్యంతో బాధపడుతున్నారా తదితర విషయాలను తెలుసుకుంటూ పరిశీలనకు సంబందించి ఆయా తేదిలను గోడ పత్రికలో నమోదు చేస్తామన్నారు .

## బెయిల్‌పై వచ్చిన పెద్దలకు జైలు అంటే ఇష్టమేమో

### - అశోక్ గజపతిరాజు



విజయనగరం: మాన్సాస్ ట్రస్టు ఛైర్మన్, బోర్డు సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం ఎవరిని నియమించినా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని.. కాకపోతే ట్రస్టు ఆనవాయితీలను పాటించే విషయంలో అడ్డు రాకూడదని ట్రస్టు ఛైర్మన్ అశోక్ గజపతిరాజు స్పష్టం చేశారు. విజయనగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ట్రస్టు బోర్డు సభ్యులుగా అందరూ మహిళలనే తీసుకుంటే ఎవరైనా కాదన్నారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రస్టు బోర్డులకు తాము ఏమాత్రం వ్యతిరేకం కాదన్నారు. ట్రస్టు పేరు చెప్పి కొంత మంది తెదేపా నేతలను పోలీసులు ఎందుకు అరెస్టు చేశారో? ఎందుకు విడిచిపెట్టారో? ఇప్పటికీ ప్రశ్నగానే ఉందన్నారు. ట్రస్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అర్థరహితంగా ఉందని ఆక్షేపించారు. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేనటువంటి ట్రస్టుపై ఎందుకు దృష్టి పెట్టారో ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. "వైకాపా అధికారంలోకి రాగానే ట్రస్టు భూములపై ఎక్కువ దృష్టి పెట్టినట్లు అనిపిస్తుంది. ఎప్పుడు మాట్లాడినా నన్ను జైలుకు పంపిస్తానని అంటున్నారు. బహుశా బెయిల్‌పై వచ్చిన పెద్దలకు జైలు అంటే చాలా ఇష్టం అనుకుంటా. అలా అనే నేను భావించాల్సి వస్తోంది" అని అశోక్ గజపతిరాజు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## 5న ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవం

### జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ

శ్రీకాకుళం : డా. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురష్కరించుకొని సెప్టెంబర్ 5న ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి మరియు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల ఆహ్వాన సంఘం కార్యదర్శి జి.పగడాలమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన జారీచేసారు. ఆదివారం ఉదయం 10గం.లకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు రెవిన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్, రాష్ట్ర శాసనసభాపతి తమ్మినేని సీతారామ్, రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక మరియు పాడిపారిశ్రామిభివృద్ధి శాఖ మంత్రి డా. సీదిరి అప్పలరాజు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు ఆమె చెప్పారు.

వీరితో పాటు పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, జిల్లా అధికారులు తదితరులు హాజరవుతారని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కావున ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## రాష్ట్ర హెూంమంత్రి సుచరిత ని మర్యాదపూర్వకంగా కలిసిన సబిరా బేగం...



కంచరపాలెం : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బిసి వెల్ఫేర్ మరియు డేవేలెప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సబిరా బేగం శుక్రవారం విశాఖపట్నం లోని నోవోటెల్ లో రాష్ట్ర హెూంమంత్రి మేకతోటి సుచరిత ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా సబిరా బేగం మాట్లాడుతూ మహిళలకు మేలుచేసే విషయంలో మా ప్రభుత్వం వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఎందుకంటే మన రాష్ట్ర హెూంమంత్రి సాక్షాత్తు ఒక మహిళ కాబట్టి అని అన్నారు. ఆమె దిశ యాప్ రూపకల్పనలో చాలా క్రియాశీలకంగా వ్యవహరించారని ఇంకా దిశ యాప్ ని అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు, యువతులను ఆదుకునేందుకు భద్రతా చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. మహిళలు సురక్షితంగా ఉండేలా తోడ్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆరోగ్యాన్నిచ్చే ఆహారాన్ని తీసుకోండి...




కంచరపాలెం : ఆరోగ్యాన్నిచ్చే మంచి ఆహారాన్ని తీసుకోవాలని చైతన్యం కల్పిస్తూ భారత ఆహార సంస్థ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నేతృత్వంలో గురువారం మధ్యాహ్నం నగరంలోని డైమండ్ పార్క్ వద్ద " పోసాన్ మహ-2021" (నేషనల్ న్యూట్రిషన్ మంత్స్) పేరుతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు బ్యానర్లు, ప్లకార్డులతో స్థానిక ప్రజలకు తీసుకోవలసిన మంచి ఆహారంపై అవగాహన కలిగించారు. జంక్ ఫుడ్స్ తీసుకోవడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, నాణ్యమైన ఆహారం తీసుకోవాలని వారంతా నినాదాలు చేశారు. ఏవైడ్ జంక్ ఫుడ్-ఈట్ గుడ్ ఫుడ్ వంటి స్లోగన్స్ తో ఏర్పాటుచేసిన ప్లకార్డులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నేతృత్వంలో ఈ నెల 1 నుండి 30 వరకు జరుగుతున్న " పోసాన్ మహ- 2021" (నేషనల్ న్యూట్రిషన్ మంత్స్)లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పాల్గొన్న ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఖ్యలో ఎఫ్ సి ఐ ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## కవి సమయం

### 'మహిమలు'

చతుర్ధశ భువన భారాన్ని
లోకహితం కొరకు మోయు ఆదిశేషుడు
ఆదిశేషుడను అవలీలగా
మూపున వహించు ఆది కూర్మమూర్తి
సముద్రమున కృంగిన భూమాతను
కొరలతో పైకెత్తి లోక హితం
గావించిన శ్రీ మహా విష్ణువు
లోక కంటకులను సంహరించి
దుష్టశిక్షణ, శిష్ట రక్షణ, సాధుజన సంరక్షణ
దశావతారాల రూపంలో గావించిన శ్రీహరి
మహాత్ముల మహిమలు అనంతం

... కవిత రచన
సి.ప్రతాప్

## పంచాంగం

| మాసం : శ్రావణ; తిథి : ద్వాదశి ఉ.6.20; పుష్యమి సా.5.12; వర్జ్యం లేదు | శనివారం 04-09-2021 |
|---|---|

**మేషం :** సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. పెద్దల ఆరోగ్య, ఆహార విషయాల్లో మెళకువ అవసరం. మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది.

**వృషభం :** విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయం లోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహ మార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది.

**మిథునం :** ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెం టేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం.

**కర్కాటకం :** స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారమవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది.

**సింహం :** విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది.

**కన్య :** ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవదర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి.

**తుల :** నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం.

**వృశ్చికం :** దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతరత్రా సహాయం ఆర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి.

**ధనుస్సు :** వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు.

**మకరం :** ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్య లెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం :** దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి.

**మీనం :** విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయం లోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

## ర్యాలి క్షేత్రానికి అందుకే ఆ పేరు వచ్చిందట!



శ్రీమహావిష్ణువు లోక కల్యాణం కోసం ధరించిన రూపాలలో జగన్మోహిని రూపం ఒకటి. దేవతల నుంచి అమృతాన్ని దక్కించుకోవడానికి అసురులు ప్రయత్నిస్తూ వుండగా, వాళ్లకి అమృత భాండం చిక్కకుండా చేయడం కోసం స్వామి జగన్మోహిని రూపాన్ని ధరించాడు. అలా స్వామి తాను అనుకున్న కార్యాన్ని పూర్తిచేసిన తరువాత, పరమశివుడి కంటపడతాడు. జగన్మోహిని సౌందర్య విశేషం సదాశివుడిని ఆశ్చర్యచకితుడిని చేస్తుంది. విష్ణు మాయ కారణంగా ఆకర్షితుడైన శివుడు .. జగన్మోహినిని అనుసరి స్తాడు. ఆయన వెంబడిస్తుండటం గమనించిన జగన్మోహిని తన నడక వేగాన్ని పెంచుతుంది. అలా హడావిడిగా ఆమె వెళుతూ వుండగా ఆమె తలలో తురుముకున్న పుష్పం ఒకటి 'రాలి' పడిపోతుంది. లోక కల్యాణం కోసం వచ్చిన జగన్మోహిని తలలోని పుష్పం 'రాలి' పడిన ప్రదేశం కనుక, ఈ ప్రదేశానికి 'ర్యాలి' అనే పేరు వచ్చిందననేది ఒక కథగా చెబుతారు. ఒకే మూలమూర్తికి ముందు భాగంలో కేశవస్వామి దర్శనమిస్తూ ఉండగా, వెనుక భాగంలో జగన్మోహిని రూపం కనిపిస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఆత్రేయపురం మండలం పరిధిలో ఈ క్షేత్రం అలరారుతోంది. అత్యంత ప్రాచీనమైన ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన, విశేషమైన ఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

## చెన్నకేశవస్వామి మహిమ!



శ్రీమహావిష్ణువు .. శ్రీచెన్నకేశవస్వామిగా ఆవిర్భవించిన క్షేత్రాలలో ఒకటిగా 'ఉల్లిపాలెం' కనిపిస్తుంది. కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని మహిమాన్వితమైన క్షేత్రాలలో ఇది ఒకటిగా వెలుగొందుతోంది. 'నగరం' మండలంలోని ఈ క్షేత్రంలో శ్రీ భూ నీలాదేవి సమేత చెన్నకేశవస్వామి పూజాభిషేకాలు అందుకుంటూ వస్తున్నాడు. ఇక్కడ స్వామి కొలువుదీరడం వెనుకనే ఆయన మహిమ ఎంతటిదో తెలుస్తుంది. పూర్వం ఇక్కడి గ్రామంలోని జమీందారుకి కలలో స్వామివారు కనిపించి తన జాడ తెలియజేసి, తనని ఈ గ్రామంలో ప్రతిష్ఠించి పూజించమని చెప్పాడట. అయితే ఇది సాధారణమైన కలే అనుకుని ఆయన తన దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమై వున్నాడు. దాంతో మరుసటి రోజు రాత్రి ఆయనకి స్వామి మళ్లీ స్వప్నంలో కనిపించడమే కాకుండా, తాను చెప్పిన విషయాన్ని మరోమారు గుర్తుచేశాడట. అంతేకాకుండా వెంటనే తన మూర్తిని ఆ గ్రామానికి తరలించమంటూ తట్టి లేపాడట. అప్పుడు ఆయన ఆ పనికి పూనుకుని 'అల్లపర్రు'లోని స్వామివారి ప్రతిమను 'ఉల్లిపాలెం' చేర్చారట. అలా స్వామి తమ గ్రామానికి కోరి వచ్చాడు కనుక, ఇక్కడి ప్రజలంతా స్వామిని తమ ఇష్టదైవంగా భావిస్తుంటారు. అనునిత్యం ఆ స్వామిని కొలుస్తూ తరిస్తుంటారు.

## ముత్యమాంబ ఆలయంలో
# సామూహిక కుంకుమ పూజలు



సబ్బవరం : మండలంలోని మేజర్ పంచాయతీలో పెదనాయుడుపాలెం గ్రామం దరి కొత్తరోడ్డు దగ్గర వెలసియున్న ముత్య మాంబ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో జరిగాయి ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీను పంతులుచే వందల మంది స్త్రీలచే సామూహిక కుంకుమ పూజలు జరిగాయి శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం కుంకుమ పూజలు జరిగా యని ఆలయ కమిటీ వారు తెలిపారు అంతే కాకుండా స్త్రీలకు ఎంతో సౌభాగ్యాన్నిచ్చే పూజలని తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణే సీఎం జగన్ లక్ష్యం



అచ్యుతాపురం : పర్యావరణ పరిరక్షణే సీఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని సర్పంచ్ గండి బోయిన భాను వెంకట్ అన్నారు. శుక్రవారం చోడపల్లి అంగన్వాడీ కేంద్రం వద్ద సర్పంచ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు అప్పారావు, దుంగా రమణ, అంగన్వాడీ టీచర్ జయమ్మ తదితరాలు ఉన్నారు.

# వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీ హెూమం



అన్నవరం : తూర్పు గోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై కొలువైయున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హెూమము ఘనంగా నిర్వహించారు.ఉదయం 9 గం.లకు పండితులు విఘ్నేశ్వర పూజ,పుణ్యాహ వచనం, అమ్మవారికి మూల,మంత్ర జపములు,సప్తపతి పారాయణ ములు నిర్వహించారు.11 గం.లకు పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలను చల్లపల్లి ప్రసాద్ శర్మ, చిట్టెం.వాసు, మరియు వేద పండితులు, అర్చకులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ పర్వత నరేష్ మరియు దేవస్థానం అధికారులు, సిబ్బంది, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వేద పండితుల వేద ఆశీర్వా దములు అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదములు అందజేశారు.

## స్టీల్ ప్లాంట్ ప్రయివేటు పరం చేయవద్దని
# 155కి రోజుకు చేరుకున్న నిరాహార దీక్ష



విశాఖపట్నం : స్టీల్ ప్లాంట్ ప్రయివేటు పరం చేయవద్దని జీవీఎంసీ గాంధీ విగ్రహం నిరాహార దీక్షలు 155 రోజుకి చేరుకున్నాయి. నేటి ఈ దీక్షలో గాజువాక జోన్ సిఐటియు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు లోకేష్ మాట్లాడుతూ స్టీల్ప్లాంట్ను ప్రైవేటీకరించరాదని ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. మన జివిఎంసి కౌన్సిల్ కూడా ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అయినా మోడీ ప్రభుత్వం స్టీల్ప్లాంట్ను అమ్మాలనే నిర్ణయంతో ముందుకు పోతున్నది. ప్రైవేటీకరణకు అడ్వయిజర్లను నియమించింది. ప్రభుత్వరంగ సంస్థలు ఉండబట్టే అసంఘటిత రంగ కార్మికుల్కెన భవన నిర్మాణ కార్మికులకు, ఆటో, ముఠా, తోపుడుబండ్లు, షాపింగ్మాల్స్ తదితర రంగాల్లోని కార్మికులకు ఉపాధి దొరుకుతుందని లేకపోతే విశాఖ నగరమే అభివృద్ధి అయ్యి ఉండేది కాదు అని అన్నారు. మోడీ ప్రభుత్వం ప్రైయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించు కోనే వరకు పోరాటాలను కొనసాగిస్తామన్నారు. ఎంతటి నియంతల్కెన ప్రజా పోరాటాలకు దిగి రాక తప్పదన్నారు. మోడీ ప్రభుత్వం ఎంత వేగంగా ప్రైవేటీకరణ విధానాలు కొనసాగిస్తే దానికి రెట్టింపు వేగంతో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ రంగం అనేది ప్రజల ఆస్థిని దానిని కొందరి వ్యక్తులకు కట్టబెట్టడం సమంజసం కాదన్నారు. ఈ దీక్షలో యూనియన్ నాయకులు ఇ. గోవిందరావు, సిహెచ్ మురళీ, ఆంజనేయులు, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న పల్లెబాటలో ఆకర్షణీయంగా పోషకాహార స్టాల్స్



మాకవరపాలెం : పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మాకవర పాలెం మండలం బయ్యు వరం గ్రామంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ను నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్గణేష్ తిలకరించారు.

# సామాజిక భరోసా ఫింఛన్ల తొలగింపు సరైనది కాదు



భీమునిపట్నం : సామాజిక భరోసా ఫింఛన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో అర్హులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు అన్నారు. అర్హుల ఫింఛన్ల తొలగింపు విషయమై భీమిలి జోన్ 1,2,3,4 మరియు భీమిలి మండలానికి సంబంధించిన నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో శుక్రవారం జోనల్ కమిషనర్. ఎస్ వి రమణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం టీడీపీ కార్యాలయం లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వస్తే 3,000 రూపాయలు ఫించన్ ఇస్తామని చెప్పి కేవలం 250 మాత్రమే పెంచి, ప్రతీ సంవత్సరం 250 రూపాయలు పెంచుతూ పోతామని సాగదీసి చెప్పిన ముఖ్యమంత్రి రెండున్నరేళ్లు గడిచినా ఎందుకు పెంచలేదని గంటా నూకరాజు ప్రశ్నించారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఫించన్ అని చెప్పి ఆగస్టు నెలలో లక్షలాది ఫించన్లు తొలగించారని, ఏ నెలలో ఆ నెలకే ఫించన్ తీసుకోవాలని లేని పక్షంలో గత నెల ఫించన్ ఇవ్వడం కుదరదని ప్రభుత్వం చెబుతోందని, ఇది ఎంతవరకు న్యాయమని గంటా నూకరాజు ప్రశ్నించారు. గత 6 నెలలుగా ఒక్క కొత్త ఫించన్ కూడా ఇవ్వలేదని అన్నారు. విశాఖ పార్లమెంటరీ పార్టీ రైతు ప్రధాన కార్యదర్శి డి.ఏ.ఎన్.రాజు మాట్లాడుతూ అవ్వ తాతలకు ఇవ్వవలసిన ఫింఛన్లకు కూడా ఎసరపెట్టే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక్క జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వమేనని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని అనివార్య కారణాల వలన ఒకనెల ఫించన్ తీసుకోక పోయినా వచ్చే నెల రెండునెలలకు కలిపి ఇచ్చేవారని గుర్తు చేశారు. కానీ నేటి ప్రభుత్వంలో ఆ వెసులుబాటు లేదని అన్నారు. అదేవిధంగా ఈకేవైసి పేరిటా ప్రభుత్వం రోజుకో నిబంధన పెడుతుందని అన్నారు. భరోసా ఫింఛన్ల విషయంలో ప్రభుత్వం అనవసరమైన నిబంధనలు పెట్టకుండా పునరాలోచించాలని కోరారు. అర్హులకు అందరికీ కొత్త ఫించన్లు ఇవ్వాలని, అన్నారు. 1వ వార్డు అధ్యక్షులు తమ్మిన సూరిబాబు మాట్లాడుతూ ఎదో ఒక కారణం చెప్పి ఫించన్లు తొలగించాలన్న నిబంధన సరైనది కాదని దీనిని వెంటనే విరమించుకోవాలని అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, 4వ వార్డు అధ్యక్షులు పాసి నర్సింగరావు, మాజీ కౌన్సిలర్లు చిలక నర్సింగరావు, పిట్టా సురేష్ నాయకులు గరికిన కింగ్, కాసరపు నాగరాజు, పెంటపల్లి యోగీశ్వరరావు, మారోజు సంజీవకుమార్, కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న, కాసరపు ఎల్లాజి, పిల్లా రాజేష్, సిద్దార్ధ వర్మరాజు, వాసుపల్లి వంశీ, , వియ్యపు పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ బ్లాక్ మార్కెట్ దందా లో పాడేరు ప్రజలు విలవిల

- సీపీఐ పార్టీ పాడేరు మండల కార్యదర్శి కూడ రాధాకృష్ణ డిమాండ్
- కాలం చెల్లిన గ్యాస్ పైపుల అక్రమాలపై ఆగస్టు 28న పత్రిక సోషల్ మీడియాలో వైరల్ అయిన నేటి వరకు స్పందించని అధికారులు
- గ్యాస్ బండల మార్పిడి కోసం గ్యాస్ గోడౌన్ లో వెళ్లిన లబ్ధిదారులకు రోజుకు ఒక రూల్స్..
- బ్లాక్ మార్కెట్లో తరలిస్తున్న వారికి మాత్రం ఏ రూల్స్ నైజంతా
- పాడేరు పట్టణంలో గ్యాస్ బండల మార్పిడి డోర్ డెలివరీ చేయాలి



పాడేరు : విశాఖ ఆదివాసి ప్రాంతమైన ఐటీడీఏ ఆమడ దూరంలో లేని పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న పాడేరు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ కాలం చెల్లిన పైప్ ల అక్రమాలపై కనీసం విచారణ చేపట్టిన పాపాన పోలేదని సిపిఐ పార్టీ పాడేరు మండల కార్యదర్శి కూడ రాధాకృష్ణ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. వారు మాట్లాడుతూ: కంచె వే చేను మేస్తే.కాపలా కాసేది ఎవరు అన్న చందంగా అధికారుల తీరు ఉందని వారు అన్నారు. ఆగస్టు నెల మొత్తం గ్యాస్ బండ మార్పిడి కోసం వెళ్ళిన లబ్ధిదారులకు 150 రూపాయలు చెల్లించకపోతే మీ గ్యాస్ బండ మార్పిడి జరగదని గ్యాస్ ఏజెన్సీ అధికారులు చెప్పడంతో గత్యంతరం లేక కాలంచెల్లిన పైపులు తీసుకోవలసిన పరిస్థితి వచ్చింది. అయితే రోజుకి 1000 నుండి 1500 వరకు లబ్ధిదారులు గ్యాస్ మార్పిడి కోసం గ్యాస్ గోడౌన్ లో బండలు మార్పిడి చేసుకోవడం జరుగుతుంది. ఒక్కరోజు వెయ్యి మంది గ్యాస్ బండలు మార్పిడి జరిగిన ఒక లక్షా 50 వేల రూపాయలు లబ్ధిదారుల నుండి అడ్డగోలుగా వసూలు చేశారని వారు మండిపడ్డారు. తక్షణమే లబ్ధిదారులకు తిరిగి డబ్బులు చెల్లించాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పాడేరు పట్టణంలో గ్యాస్ బండలు మార్పిడి కోసం డోర్ డెలివరీ చేయాల్సి ఉన్నప్పటికీ డోర్ డెలివరీ చేయడం లేదని తక్షణమే పాడేరు పట్టణ పరిధిలో గ్యాస్ బండలు మార్పిడి కోసం డోర్ డెలివరీ చేయాలని, బ్లాక్ మార్కెట్లో విచ్చల విడిగా గ్యాస్ బండలు తరలి పోతున్నాయని, పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాలకు ఏకైక ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఒకటి ఉండటంతో రైతుల పనులు మానుకొని 20 ,30 కిలోమీటర్లు దూరం నుంచి వచ్చే లోపే బ్లాక్ మార్కెట్లో తరలిపోవడం తో గ్యాస్ బండలు అయిపో వలసి వచ్చిందని గ్యాస్ అధికారులు చెప్పడంతో నిరాశతో గ్యాస్ గూడెం లో నే పడిగాపులు కాయాల్సి వస్తుందని అందులో గ్యాస్ ఏజెన్సీ అధికారులు రోజుకో కొత్త రూల్స్ తీసుకురావడం గ్యాస్ లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారని తక్షణమే గ్రామాలలో గ్యాస్ బండలు మార్పిడి డోర్ డెలివరీ చేయాలని, గ్యాస్ పైపుల అక్రమాల నిజాలు నిగ్గు తేల్చాలని వారు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో లో సిపిఐ పార్టీ పాడేరు మండలం నాయకులు అమర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం తొలగించిన పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలి

## డుంబ్రిగూడ ఎంపీడీవోకి మెమోరాండం అందజేసిన టీడీపీ జాతీయ అధ్యక్షులు



అనంతగిరి : అరకు నియోజకవర్గం డుంబ్రిగూడ మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు అరకులోయ నియోజకవర్గం, డుంబ్రిగూడ మండలం, గౌరవనీయులు నారాచంద్రబాబునాయుడు పిలుపు మేరకు మండల పార్టీ అధ్యక్షులు తుడుము సుబ్బారావు అధ్యక్షతన... పెండింగ్ పింఛన్ డబ్బులు పంపిణీ చేయకపోవడం గతంలో ఇచ్చిన హామీ మేరకు పెంచుకుంటూ పోతాం అని చెప్పిన పింఛన్ పెంచకపోవడం ఆధార్ లో వయసు మార్పు, కేవైసీ,ఇతర ప్రాంతంలో నివాసం ఒకే ఇంట్లో ఒకే పింఛన్ వంటి కొత్త నిబంధనలను తెరపైకి తెచ్చి లబ్ధిదారులను తొలగించడంపై ఎలాగైనా ప్రతి సంక్షేమ పథకాల్లో కోతలు విధిస్తున్న ప్రభుత్వం తొలగించిన పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలని డుంబ్రిగూడ ఎంపీడీవోకి మెమోరాండం ఇవ్వడం అయినది. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు, జిల్లా ఎస్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కె.సుబ్బారావు, మాజీ ఎంపీపీ కోర్రదాన్నే రావు, అరకు పార్లమెంట్ టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, మాజీ సర్పంచ్ పి.సుబ్బారావు, మండల పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు గోళ్లోరి ప్రసాద్, జి.నాగంద్రబాబు, బొంజి బాబు తదితరులు పాల్గొన్నారు.

# కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరుస్తున్న చిన్నారి శ్రాఘవి



విశాఖపట్నం : చిన్న వయసు నుంచే నృత్యం పట్ల ఆసక్తి పెంచుకొని అనతికాలంలోనే మంచి కూచిపూడి నృత్య కళా కారిణిగా గుర్తింపు తెచ్చుకుంది చిన్నారి ధూళిపాల శ్రాఘవి. ఎన్నో నృత్య ప్రదర్శనలు ఇస్తూ ఎంతోమంది ఆదరాభిమానాలు చూరగొంది. సంగీతానికి తగినట్లుగా నృత్య భంగిమలు ఇస్తూ, ముఖంలో చక్కటి హావభావాలు పలికిస్తూ పలువురిని తన నృత్యంతో ఆకట్టుకుంటుంది. విశాఖ తో పాటు ఇతర రాష్ట్రాలలోనూ అలాగే ఇతర దేశాలలో కూడా తన నృత్య ప్రదర్శనలు చేసి ఆబాల గోపాలాన్ని అలరించింది. ప్రస్తుతం ఆమె విశాఖ లో గల వెంకోజి పాలెం లో అమ్మమ్మ, తాతయ్య లు డాక్టర్ ఎస్.శారదా దేవి, డాక్టర్ ఎస్.కృష్ణమూర్తి ల వద్ద ఉంటుంది. నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో ఆమె ఏడవ తరగతి చదువుతుంది. ఆమె ఎదుగుదలకు వాళ్ళు ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నారు. తల్లిదండ్రులు శిరీష శ్రీకాంత్ లు ఆస్ట్రేలియా లో ఉంటున్నారు. వారు కూడా శ్రాఘవికి అన్ని విధాల తమ సహకారాన్ని అందజేస్తున్నారు. మూడేళ్ల వయసు నుంచే నృత్యం పట్ల ఆకర్షితురాలైన శ్రాఘవి ఆ వయసు నుంచే నృత్యంలో శిక్షణ పొందడం ప్రారంభించింది. అలా ఆమె ఆ నృత్యంలో ఆరితేరి ఎన్నో ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది. ఇప్పటి వరకు 52 కూచిపూడి ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది. అలాగే 20 వెస్టర్న్, ఫోక్ డాన్స్ ప్రదర్శనలు కూడా ఇవ్వడం జరిగింది. నృత్యం లోనే కాకుండా స్కూల్ లో నిర్వహించే పలు ఆటల పోటీలలో కూడా గెలిచి ఎన్నో బహుమతులు సాధించింది. చిత్రలేఖనం, క్విజ్ వంటి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి న్యాయనిర్ణేతల ప్రశంసలందుకుంది. అలాగే చదువులో కూడా కూడా రాణిస్తూ అధ్యాపకుల మన్ననలు పొందింది. ఇక నటనలో కూడా ప్రతిభ కనబరుస్తూ పలు అవార్డులను సొంతం చేసుకుంది. దర్శకుడు సత్యాడ నరసింగరావు రూపొందించిన 'డోంట్ కిల్ గర్ల్ చైల్డ్', ' ఫాలో ది రూల్స్', ' హెల్పింగ్ హ్యాండ్స్' షార్ట్ ఫిల్మ్ లలో ఆమె నటించింది. ఇందులో రెండు షార్ట్ ఫిల్మ్ లు రాష్ట్రస్థాయి షార్ట్ ఫిలిం పోటీలలో అవార్డులు గెలుచుకున్నాయి. 'ఫాలో ది రూల్స్' షార్ట్ ఫిల్మ్ లో తను చేసిన క్యారెక్టర్ కి బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ అవార్డును కూడా సొంతం చేసుకుంది. ఇక నృత్యానికి సంబంధించి ఆస్ట్రేలియాలోని క్వీన్స్ లాండ్, ముంబాయి లలో శ్రాఘవి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. నృత్య విభాగంలో అస్సాం బుక్ ఆఫ్ రికార్డ్స్ మోస్ట్ పాపులర్ ఇండియన్ అవార్డును ఆమె అందుకోవడం జరిగింది. అలాగే రోటరీ క్లబ్ గురించి ఇంటర్నేషనల్ లీడర్ షిప్ ఎక్సలెన్సీ అవార్డు, విశాఖ మీడియా సర్వీస్ నిర్వహించిన కార్యక్రమంలో సంఘమిత్ర అవార్డు, వినియోగదారుల హక్కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కూడా మరొక అవార్డునుఅందుకోవడం జరిగింది. అదేవిధంగా వరల్డ్ మ్యూజిక్ డే సందర్భంగా సబ్ జూనియర్ విభాగంలో కూడా ఆమె అవార్డును గెలుచుకోవడం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారి ధూళిపాల శ్రాఘవి మాట్లాడుతూ తల్లిదండ్రులు శిరీష, శ్రీకాంత్ లు, అమ్మమ్మ, తాతయ్య లు డాక్టర్ ఎస్.శారదా దేవి, డాక్టర్ ఎస్.కృష్ణ మూర్తిల ప్రోత్సాహం ఎన్నటికీ మరువలేనిదని పేర్కొన్నారు. ప్రస్తుతం తాను ఈ స్థాయికి రావడానికి కారణం వీళ్లేనని చెప్పారు. అలాగే తన స్కూల్ అధ్యాపకులకు అదే విధంగా తనకు నృత్యం నేర్పిన గురువులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. అటు గురువులు ఇటు కుటుంబ సభ్యులు గర్వపడేలా తాను మంచి స్థాయికి ఎదగాలని ఆశిస్తున్నానని, ఆ క్రమంలోనే తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

## నేడు ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్

విశాఖపట్నం : రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలు , ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిర్బంధ పరిస్థితులకు నిరసనగా రేపు అనగా 04-09-2021 శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ విద్య సంస్థలు ఒక రోజు బంద్ ప్రకటించడమైనది. అపుస్మా విశాఖ డిస్ట్రిక్ట్ యూనిట్ ప్రెసిడెంట్ ఎంవీ.రావు, సెక్రటరీ డా.శ్రీనివాస్, ట్రెజరర్ ఎం.వీ.వి .సత్యనారాయణ, రాష్ట్రం తలపెట్టిన బంద్ కి విశాఖ జిల్లా తరపున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారు.

## పాడి రైతు కుటుంబానికి బీమా చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న దృశ్యం

గొలుగొండ : విశాఖ డెయిరీ ద్వారా పాడిరైతు కుటుంబానికి భీమా చెక్కు పంపిణీ చేశారు. గొలుగొండ మండలం అమ్మపేట పాలసేకరణ కేంద్రంలో పాడి రైతు గోర్లి గంగునాయుడు ఇటీవల మృతి చెందటంతో రూ.15వేల భీమా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ రాజ్‌కుమారి, వైజర్ సతీష్, అధ్యక్షులు సత్యనారాయణ, పిఎస్ పి.అప్పల నాయుడు, రైతులు పాల్గొన్నారు.

## నేడు శనీశ్వరుడికి అభిషేకాలు, పూజలు

కొయ్యూరు : ఈ నెల 4న శనివారం అమావాస్య ముందు శని త్రయోదశి సందర్భంగా కొయ్యూరు గ్రామంలో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక సమేత శ్రీమల్లికార్జునస్వామి వారి ఆలయంలో శనీశ్వరుడు అభిషేకాలు, నువ్వుల దానలు, పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ, ఆలయ పంతులు తెలిపారు. మరెన్ని వివరాలకు 9490430354 కు సంప్రదించాలన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారం కోసమే జగనన్న పల్లెబాట

### నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

మాకవరపాలెం : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్న పల్లె బాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ అన్నారు. శుక్రవారం మాకవరపాలెం మండలం మల్లవరం, గిడుతూరు, బయ్యవరం, కొండలఅగ్రహారం గ్రామాల్లో జగనన్న పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సమస్యలకు తక్షణ పరిష్కారం చేపట్టాలని ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జగనన్న పల్లెబాట కార్యక్రమం చేపడుతున్నామన్నామన్నారు. అధికారులు ప్రజల సమస్యలు వేంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మండల శాఖ అధికారులతో గ్రామసభ నిర్వహించి గ్రామస్తుల నుండి సమస్యలు విని వినతులు స్వీకరించారు. గ్రామస్థుల సమస్యలను నేరుగా తనకు తెలియజేస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామని, వెంటనే జరగకపోతే వారం పది రోజుల్లో సమస్యను ఖచ్చితంగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాణీఅమ్మాజి, ఎంపిడిఒ అరుణశ్రీ, ఎస్సై రామకృష్ణారావు, వైసిపి మండలాధ్యక్షులు రుత్తల సత్యనారాయణ, వైసిపి నాయకులు వాసు, రుత్తల సర్వం, మూకల బాలకృష్ణ, పెట్ల భద్రాచలం, శీరంరెడ్డి సూర్యనారాయణ, వైసిపి కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాకినాడలో రైల్వే జీఎం పర్యటన

కాకినాడ : రైల్వే లైన్ల పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం కాకినాడ పట్టణ రైల్వే స్టేషన్‌కు రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా విచ్చేశారు. వంగా గీతా విశ్వనాథ్, జెడ్ఆర్‌యుసి మెంబర్స్ మాధవరావు, బోడపాటి శ్రీను మర్యాదపూర్వకంగా కలిసినారు.

## ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జివియంసీ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా గెలుపొందిన సభ్యులకు సన్మాన కార్యక్రమం



విశాఖపట్నం : ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో బీవీకే కాలేజ్ దగ్గర గల పబ్లిక్ లైబ్రరీ నందు సంఘం యొక్క సమావేశం, అలాగే విశాఖపట్నం జిల్లా సంబంధించి నియోజకవర్గాల వారీగా నియోజకవర్గ అధ్యక్షులను విజయనగరం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమం, అలాగే మన సంఘం లోనే సభ్యులుగా ఉంటూ ఇటీవల జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్ గా గెలుపొందిన 35 వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కర్ రావుకి, 29వ వార్డు కార్పొరేటర్ ఊరు కోటి నారాయణకి సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ నగర మేయర్ జి వెంకట హరి కుమారి, తైనాల విజయ్ కుమార్, డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి, ద్రోణంరాజు శ్రీ వత్స వ్, కార్పొరేటర్ 30 వ వార్డు అప్పల రత్నం, విశాఖ బార్ అసోసియేషన్ బిసి సంఘం అధ్యక్షులు సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు. ఈ యొక్క సమావేశం సంఘం అధ్యక్షులు కొణతాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మేయర్ చేతుల మీదుగా నియోజకవర్గాల వారీగా నియమించిన నియోజకవర్గం అధ్యక్షులు మరియు విజయనగరం జిల్లా అధ్యక్షులు నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ దంపతులకు సన్మానించే కార్యక్రమం నిర్వహించాం. అలాగే బీసీలు వివిధ రంగాల్లో సేవలు చేస్తున్న వారిని సన్మాన కార్యక్రమం కూడా జరిగింది. ఈ కార్యక్రమ లో సంఘం ఉపాధ్యక్షురాలు ఆలేటి హేమలత, కె.రామ్ కుమార్, సిటీ మోటార్స్ వెంకటేశ్వరరావు, కోట రమేష్, కె.మధుసూదన్, పిల్ల అప్పారావు, కొయ్య రామకృష్ణ, కండి పిల్లి నర్సింగ్ రావు, బోధన్ రమేష్, అంగడి రమణ, వివిధ నియోజకవర్గాల నుంచి బీసీ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం విశాఖపట్నం జిల్లా నియోజకవర్గాల వారీగా నియోజకవర్గ అధ్యక్షులను నియమించడం జరిగింది.**

1. విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం జి.సూరం నాయుడు; 2. విశాఖ పశ్చిమ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు ఎం.వరలక్ష్మి; 3.విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షులు జి వెంకట్రావు; 4. విశాఖ ఉత్తర నియోజకవర్గం కె వి మురళి కృష్ణ; 5.విశాఖ దక్షిణ నియోజకవర్గం కండి పిల్లి నర్సింగ్ రావు; 6.విశాఖపట్నం పెందుర్తి నియోజకవర్గం కె.ఆదినారాయణ; 7.విశాఖపట్నం భీమిలి నియోజకవర్గం పి.రామకృష్ణ; 8.విశాఖపట్నం అనకాపల్లి నియోజకవర్గం విల్లూరి గణేష్; 9.విశాఖపట్నం ఎలమంచిలి నియోజకవర్గం అంగ టీ అప్పలరాజు ; 10.విశాఖపట్నం గాజువాక నియోజకవర్గం ఎం.శ్రీనివాస్; 11.విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎ.శ్రీనువాసు.

శుక్రవారం జరిగే ఈ కార్యక్రమంలో....

పైన తెలిపిన వారందరికీ గౌరవ విశాఖపట్నం మేయర్ చేతుల మీదుగా ముఖ్య అతిథులు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయడం జరిగింది.

# పరిశ్రమల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు కీలకం

**- యాజమాన్యాలు దృష్టి సారించాలి - ఎల్‌జి పాలిమెర్స్ ఉదంతం ఎన్నో పాఠాలు నేర్పింది - నర్సీపట్నం ఆర్డీవో ఆర్.గోవిందరావు**



విశాఖపట్నం : పరిశ్రమల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు కీలకం అని నర్సీపట్నం ఆర్డీవో ఆర్.గోవిందరావు సూచించారు. శుక్రవారం సాయంత్రం కార్యాలయ సమావేశ మందిరం లో కర్మాగారాల తనిఖీ శాఖ ఆద్వర్యం లో లోకల్ క్రైసిస్ గ్రూప్ సమావేశం నిర్వహించారు.దీనికి ముఖ్య అతిధి గా ఆర్డీవో గోవిందరావు పాల్గొని ప్రసంగించారు. ఎల్‌జి పాలిమెర్స్ ఉదంతం ఎన్నో పాఠాలు నేర్పిందన్నారు. స్థానిక ఆసుపత్రులను అప్రమత్తం చేయాలన్నారు. నిపుణులైన సిబ్బందిని నియమించడం ద్వారా ప్రమాదాలు రాకుండా చూడవచ్చు అన్నారు. కార్మికుల సంక్షేమం ఎంతో ముఖ్యం అన్నారు. పరిశ్రమల్లో క్షేత్ర స్థాయి లోపాలు అధిగమించాలి అని సూచించారు. భద్రతా చర్యలు తీసుకొని ప్రగతిపథంలో పయనించాలని కోరారు. పరిశ్రమలను ప్రజలతో అనుసంధానం చేసి ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మాక్ డ్రిల్ తరచూ నిర్వహించాలని, పర్యావరణ పరి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమల నిర్వాహకులు తమ సమస్యలను నివేదిస్తే జిల్లా కలెక్టర్ తో మాట్లాడి పరిస్కార మార్గాలు చూపుతామన్నారు. విశాఖ జిల్లాలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు ఐతే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చిత్త శుద్దితో ఉందన్నారు.పరిశ్రమల భద్రతా వ్యవహారంలో రాజీ లేదన్నారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పైడి చిన్నా రావు మాట్లాడుతూ లోకల్ క్రైసిస్ గ్రూప్ సమావేశం నిర్వహించడం ద్వారా స్థానిక పరిశ్రమలను, వాటిలో అమలవుతున్న భద్రతా చర్యలపై చర్చించడం ద్వారా పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ మార్గాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుసుకోవచ్చు అన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఈ సమావేశం ప్రతి మూడు నెలలకు ఒక సారి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా డెక్కన్ కెమికల్స్, హెట్రో లాబ్స్, హెచ్‌పిసిఎల్ పైప్ లైన్ పరిశ్రమల అధికారులు తమ పరిశ్రమల్లో తీసుకుంటున్న భద్రతా చర్యలపై ప్రత్యేక పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ చేశారు. ఈ సమావేశంలో క్రైసిస్ గ్రూప్ సభ్యులు, ఎస్.రాయవరం ఎమ్మార్వో సత్యనారాయణ, నక్క పల్లి సిఐ నారాయణ రావు, కేశవరం సర్పంచ్, రెవిన్యూ, ఫైర్, పరిశ్రమల అధికారులు పాల్గొన్నారు.



## స్కూల్ షెడ్డు కట్టించలేని దుస్థితిలో పిఓ

**- అభివృద్ధి చేస్తామంటే ఉండండి లేదా వెళ్ళిపోవచ్చు**
**- ఐటిడిఎ పివో తో దారెలా సర్పంచ్ పాండురంగ స్వామి వాగ్వాదం**





పాడేరు : ముంచంగిపుట్టు మండలం దారెలా పంచాయతీ చీకుచింత రంగేలిసింగ్ స్కూల్ బిల్డింగ్ సాంక్షన్ చేయాలని అనేకసార్లు ఐటీడీఏ పీవో తో దారెల సర్పంచ్ పాండురంగస్వామి కలిశారు ఇటీవల ముంచంగిపుట్టు పర్యటనకు వెళ్ళిన ఐటీడీఏ పీవో ను కలవగా 15 రోజుల్లో షెడ్డు నిర్మిస్తామని ఐటిడిఎ పిఓ హామీ ఇచ్చారు. అయితే 16వ రోజు ఐటిడిఎ గ్రీవెన్స్ లో ఐటీడీఏ పీవో ను కలిసి నిరసన తెలియజేశారు ఇచ్చిన మాట ప్రకారము మీరు 15 రోజుల్లో షెడ్డు నిర్మించలేదని మాట తప్పారని ఇప్పటికైనా వెంటనే స్కూల్ బిల్లింగ్ షెడ్డు అయినా నిర్మించాలని ఐటీడీఏ పీవో ను విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ స్కూల్ బిల్డింగ్ అప్పుడే ఇవ్వలేమని స్కూల్ షెడ్డు నిర్మించలేము అని ఐటీడీఏ పీవో చెప్పగా ఈ ప్రాంత అభివృద్ధి చేస్తాం అంటే మీరు ఉండవచ్చని చదువుకోటానికి పిల్లలకు స్కూల్ షెడ్డు అయిన నిర్మించకపోతే ఎలా అని ఇష్టముంటే మీరు పని చేయండి లేదంటే వెళ్లిపోవచ్చని ఎవరు ఫ్రీగా చేయడం లేదని జీతం తీసుకునే అందరూ పని చేస్తున్నారని విద్యార్థులకు స్కూల్ షెడ్డు ఇవ్వలేని మీరు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే మీకు ఇష్టం ఉంటే ఉండండి లేదంటే మీరు వెళ్లిపోవచ్చని ఐటీడీఏ పీవో ను దారెలా సర్పంచ్ అన్నారు. అంతకు ముందు గ్రీవెన్స్ చాంబర్లో దారెలా సర్పంచ్ కింద కూర్చొని మాకు స్కూల్ షెడ్డు ఎప్పుడు నిర్మిస్తారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిధులు ఇవ్వటం లేదు అందుకే మేము ఇవ్వలేకపోతున్నామని ఐటీడీఏ పీవో చెప్పగా ఐటీడీఏ నిధులతో నైనా వెంటనే స్కూల్ షెడ్డు నిర్మించాలని సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి డిమాండ్ చేశారు. అయితే కాసేపు వెయిట్ చెయ్ అని మాట్లాడదామని పీ ఓ సర్పంచ్ను కోరగా గ్రీవెన్స్ అయ్యేంతవరకు వెయిట్ చేసిన అనంతరం దారాల సర్పంచ్ సార్ మా సమస్య పరిష్కరించండి అని కోరగా పి ఓ నేనేమి చేయలేను అని చెప్పగా ఈ సమాధానం ఎవరికీ సంతృప్తిగా ఉండటం లేదని మీకు ఇష్టముంటే ఉండాలని లేదంటే వెళ్ళిపోవచ్చు అసమర్థ అధికారులు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే అని ఇలాంటి అధికారులు ఉంటే గిరిజన ప్రాంతం అభివృద్ధి కుంటు పడుతుందని పేరుకే ఐఏఎస్ అధికారి గా ఉన్నారని ఏ ఒక్క సమస్య కూడా పరిష్కరించడం లేదని ఐటీడీఏ పీవో తీరుపట్ల జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని ఇప్పటికైనా ఐటీడీఏ పీవో తీరు మార్చుకోని ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని దారెలా సర్పంచ్ పాండురంగ స్వామి డిమాండ్ చేశారు అయితే పంచాయతీల్లో స్కూల్ బిల్డింగ్ నిర్మాణం జరిగే వరకూ పోరాటం చేస్తూనే ఉంటానని ఈ సందర్భంగా సర్పంచ్ పాండురంగ స్వామి అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంట సర్పంచులు సత్యనారాయణ బాకూరు వెంకటరమణ రాజు ఎంపీటీసీ అభ్యర్థి శశీ భూషణ్ నాయుడు వార్డు సభ్యులు లోలిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య జీవనానికి ఔషధ మొక్కలు పెంచండి

**- జివిఎంసి అదనపు కమిషనర్ ఎ.వి. రమణి**



విశాఖపట్నం : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించడానికి ఔషధ, పోషకాహార మొక్కలు పెంపకం చాలా దోహద పడుతందని, ప్రతీ మనిషికి ఆయువును పెంచడమే కాకుండా, పలు వ్యాధులను దూరం చేస్తాయని జివిఎంసి అదనపు కమిషనర్ ఎ.వి.రమణి అన్నారు. శుక్రవారం జివిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ బయో డైవర్సిటీ(ఎపిఎస్ బి) బోర్డు, జివిఎంసితో కలసి నిర్వహించిన (ఆయుష్ ఆప్కే ద్వార్ పర్) 'ఇంటింటికీ ఔషధ మొక్కల పంపిణీ' ప్రారంభ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఎపిఎస్ బి బోర్డు పంపిణీ చేస్తున్న ఔషధ, పోషకాహార మొక్కలను ప్రతీ ఇంటిలోనూ పెంచుకోవాలన్నారు. ఈ మొక్కల వలన ప్రతి మనిషి ఆయువును పెంచుకోవడమే కాకుండా వ్యాధులను దూరం చేసుకోగల మన్నారు. తద్వారా ఆరోగ్యంగా జీవంచవచ్చునన్నారు. అనంతరం ఎపిఎస్‌బి బోర్డు రీజనల్ కోఆర్డి నేటర్ జానకీ రావు మాట్లాడుతూ నేషనల్ మెడికల్స్ ప్లాంట్స్ బోర్డు, ఎపిఎస్ బి బోర్డు రాష్ట్ర మంతటా అన్ని జిల్లాలలో పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రతీ జిల్లలో 10 మండలాలలో 'ఇంటింటికీ ఔషధ మొక్కల పంపిణీ" కార్య క్రమం ప్రారంభించబడుతుందన్నారు. ఈ పంపిణీ కార్యక్రమం జివిఎంసితో కలసి ప్రారంభించాలని ప్రతి పాదనలు చేస్తున్నా



మని జానకీ రావు అన్నారు. ఈ ఔషధ, పోషకాహార మొక్కలు పంపిణీ కార్యక్రమం కేవలం ఎన్జీఓస్ తోనే నడుపబడుతుందన్నారు. అనంతరం డాక్టర్ ఎం.వి.వి. మురళీ మోహన్ రావు మాట్లాడుతూ వ్యాధులను దూరం చేసుకోవాలంటే, రోగ నిరోధక శక్తిని పెంచే ఔషధ మొక్కలు అవసరమన్నారు. ప్రతి మనిషికి కావలసిన విటమిన్లను వృద్ధి చేయగల పోషకాహార మొక్కలను ప్రతి ఇంటిలో పెంచుకోవడం చాలా అవసరమన్నారు. అనంతరం గ్రీన్ క్లైమేట్ ఎన్జిఒ ప్రతినిది జె.వి.రత్నం మాట్లాడుతూ 3900 ఔషధ మొక్కలను తమ ఎన్జిఓ సేకరించిదని అన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి వలన ప్రజలందరూ ఇప్పుడు పోషకాహార, ఔషధ మొక్కలు ద్వారా లభించిన వస్తువులనే ఉపయోగిస్తున్నారన్నారు. ప్రతి ఇంటిలో, మిద్దెలపై ఈ మొక్కలను పెంచాలని, అందుకు సేంద్రీయ ఎరువుతోనే మొక్కలను పెంచుకోవాలని, తద్వారా ఆర్థిక లాభంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జె.వి.రత్నం తెలిపారు. అనంతరం, పలు ఔషధ, పోషకాహార మొక్కలను లబ్ధిదారులకు అదనపు కమిషనర్ ఎ.వి. రమణి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యు.ఎన్.డి.పి. కోఆర్డినేటర్ ఎన్. శ్రీనివాస్, రాజా మణి తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశం



విశాఖపట్నం : భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో రాజ్యసభ ఎంపీ జివిఎల్.నరసింహారావు మరియు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు లతో విశాఖపట్నం జిల్లా బీజేపీ ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. భారతీయ జనతా పార్టీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జివిఎల్.నరసింహారావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించేందుకు అందించిన తోడ్పాటు, కేటాయించిన నిధుల గురించి తెలిపారు. ముఖ్యంగా మహారాష్ట్ర తరువాత రెండవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ లోని జాతీయ రహదారుల నిర్మాణానికి సుమారు 25,500 కోట్ల రూపాయలను కేటాయించారని అన్నారు. రాష్ట్రంలోని గ్రీన్ కారిడార్ నిర్మాణానికి మరియు రాష్ట్రంలోని జిల్లాలను కలుపుతూ రహదారుల నిర్మాణానికి పిఎంజెఎస్‌వై పథకం క్రింద 2500 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. కొత్తగా 16 రైల్వే ప్రాజెక్టులను మరియు రైల్వే లైన్ల డబ్లింగ్ ప్రాజెక్టుల కోసం 45 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ప్రసాద పథకం క్రింద నిధులను మంజూరు చేసి సింహాచలం వంటి దేవస్థానాల అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేసిందని అన్నారు. విశాఖపట్నంలో ఐఐఎం పెట్రోలియం యూనివర్సిటీ వంటి విశ్వవిద్యాలయాల ఏర్పాటు, విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ విస్తరణ వంటి అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రమే నిధులను వెచ్చిస్తోందని తెలిపారు. సాగరమాల పథకం క్రింద విశాఖపట్నానికి పోర్ట్ కనెక్టివిటీ ఏర్పాటు చేయడంలో బీజేపీ ప్రభుత్వం ప్రధాన పాత్ర పోషించిందని అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ హయాంనుండి ప్రైవేట్ రంగాన్ని పూర్తిగా విస్మరిస్తూ ప్రభుత్వమే అన్ని వాణిజ్య సంస్థలను నిర్వహిస్తుండడం వలన చాలావరకు ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాలను ఎదుర్కోవలసి వచ్చిందని అన్నారు. 1980 దశకంలో స్థూల దేశీయ ఉత్పత్తి లో భారతదేశంతో సమానంగా వున్న కమ్యూనిస్టు దేశమైన చైనా ప్రైవేట్ రంగంలో పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు పెట్టుబడులు పెట్టేలా సంస్కరణలు చేపట్టి, ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంతో ఈ రోజున 4.78 రెట్లు పెరిగిందని తెలిపారు. ఆర్థిక నిపుణులు ముక్తకంఠంతో హర్షిస్తున్న ఆత్మనిర్భరభారత్ లో భాగంగా నాలుగు వ్యూహాత్మక రంగాలలో మినహా మిగతా అన్ని రంగాలలో పెట్టుబడుల ఉపసంహరణ దిశగా ముందుకు సాగుతున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ముమ్ముందు ప్రభుత్వ రంగ సంస్థలలో నష్టాలను నివారించడమే కాకుండా, అనేక అనుబంధ పరిశ్రమల ఏర్పాటు, వాటి పురోగతి, తద్వారా అందుబాటులోకి వచ్చే లక్షలాది ఉద్యోగాలతో పాటు భవిష్యత్తులో ప్రజలపై పడే భారాన్ని కూడా తగ్గిస్తుంది అని నరసింహారావు తెలిపారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నుండి పెట్టుబడుల ఉపసంహరణ గురించి మాట్లాడుతూ ప్లాంట్ కు అనుబంధంగా వున్న మొత్తం 26 ఎంప్లాయిస్ యూనియన్స్ లో కేవలం కమ్యూనిస్ట్ పార్టీలకు చెందిన ఎంప్లాయిస్ యూనియన్స్ మినహా మిగతా అన్ని యూనియన్స్ కూడా మద్దతు తెలుపుతున్నాయని జివిఎల్.నర సింహారావు స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిస్వార్థంగా అందిస్తున్న సహాయసహకారాలు అర్థం చేసుకున్న ప్రజల మద్దత్తు నానాటికీ పెరుగుతుండడం చూసి ఓర్వలేనితనంతో అధికారంలో నున్న వైస్సార్సీపీ, ప్రతిపక్షంగా చెప్పుకుంటున్న టీడీపీ బురద జల్లుడు కార్యక్రమాన్ని తమ దైనందిక చర్యగా చేసుకున్నాయని అన్నారు. జగన్ ప్రభుత్వమైతే ప్రతీది తమ సొంత వ్యాపారంగా మార్చేసి ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తూ, రాజ్యాంగ విరుద్ధంగా చేస్తున్న అప్పులతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గుత్తాధిపత్య పోకడలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెప్తారని సోము వీర్రాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందిస్తున్న సహాయాన్ని, నిధులను ప్రజలకు తెలియజేయాలని ఆహూతులకు హితవు పలికారు.

అదే విధంగా ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికై కృషి చెయ్యాలని, అవసరమైతే పోరాటం చేయడానికైనా సిద్ధపడాలని అన్నారు.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.విష్ణుకుమార్ రాజు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.సుహాసిని, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కె. సురేంద్ర మోహన్, బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యులు ఉప్పిలి వంశి యాదవ్, బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా ఇంచార్జి కోడూరు లక్ష్మీనారాయణ, బీజేపీ అనకాపల్లి జిల్లా ఇంచార్జి ఎస్‌విఎస్.ప్రకాష్ రెడ్డి, బీజేపీ అరకు పార్లమెంట్ జిల్లా ఇంచార్జి ఎంఎంఎన్.పరశురామరాజు మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వినాయక చవితి వేడుకల్లో తప్పనిసరిగా ప్రజలు కోవిడ్ నిబంధనలు పాటించాలి

- సి ఐ కూన దుర్గాప్రసాద్



మల్కాపురం సిఐ కూన దుర్గా ప్రసాద్

ములగాడ : కోవిడ్ మహమ్మారి వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున మల్కాపురం పోలిస్టేషన్ పరిధి లో గణేష్ విగ్రహాలను,పండాలను బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేయడానికి గణేష్ విగ్రహాలతో ర్యాలీ చేయడం, నిమజ్జనం చేయడం, మైక్ సెట్ వాడడానికి అనుమతి లేదని మల్కాపురం పోలిస్టేషన్ లా అండ్ ఆర్డర్ సి ఐ కూన దుర్గాప్రసాద్ హెచ్చరించారు. విజయభాను ప్రతినిధి తో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో పూజలకు వెళ్ళినపుడు పూజా సామాగ్రి కొనుగోలుకు మార్కెట్ కి వెళ్ళినప్పుడు విధిగా మాస్కులు ధరించడం భౌతిక దూరం పాటించడం, తరచుగా చేతులను శానిటైజ్ చేయాలని తెలిపారు. ఇప్పటికే కొవిడ్ ముప్పు పొంచి ఉందన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, రాబోవు పండుగల సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు గుమికూడ వద్దని వీలైనంత వరకు ప్రజలు ఇళ్ల వద్దనే పూజలు నిర్వహించుకోవాలని సూచించారు. వ్యాక్సిన్లు వ్యాధి నుంచి రక్షణ మాత్రమే కల్పిస్తాయని అందువలన వ్యాక్సినేషన్ తర్వాత ప్రతి ఒక్కరూ మాస్కు తప్పనిసరిగా వాడాలని సి పి ఆదేశాలు జరిచేసారని తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోబడునని, ఇది గమనించాలని పౌరులను కోరారు.

# శాస్త్రోక్తంగా రత్నగిరి పై ఆన్‌లైన్‌లో వరలక్ష్మిదేవీ వ్రతాలు

- జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంను ప్రారంభించిన ఈవో త్రినాధరావు దంపతులు.



అన్నవరం : తూర్పు గోదావరి జిల్లా శంఖవరం మండలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం లో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా శ్రీ స్వామివారి సన్నిధిలో ఉదయం 8 గంటలకు భక్తులు ఆన్ లైన్ ద్వారా పరోక్షంగా వీక్షించుటకు గాను వరలక్ష్మీ దేవి వ్రతాల ను దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి. త్రినాధరావు దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.కోవిడ్ ఆకాంక్షల నేపథ్యంలో ప్రత్యక్షంగా చేసుకోలేని భక్తులకు అందుబాటులో శ్రీ స్వామివారి యూట్యూబ్ ఛానల్ ద్వారా వరలక్ష్మీ వ్రతాలు ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు.

ముందుగా వేద పండితులు,ఆలయ ప్రధాన అర్చకుడు కోట. శ్రీనివాస్ ఆధ్వర్యంలో వరలక్ష్మీదేవి అమ్మవారిని వివిధ రకములైన సుగంధభరితమైన పుష్పాలతో అలంకరించి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పూజాది కార్యక్రమంలో వేదపండితులు,ఆలయ అర్చకులు,వ్రత పురో హితులు మరియు వ్రతాల విభాగం ఏఈవో దామెర. కృష్ణారావు,ఆలయ సూపరింటెండెంట్ లు బలువు.సత్య శ్రీనివాస్, పర్వత.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక భరోసా పెన్షన్లను తొలిగించడం అన్యాయం

## ఎంపీడీవో కి వినతిపత్రం అందజేసిన టీడీపీ నాయకులు



పరవాడ : సామాజిక భరోసా పెన్సన్లను అడ్డగోలుగా తొలగించడం, రూ.3000 పెన్సన్ హామీని మోసం చేయడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని వ్యతిరేఖిస్తూ టీడీపి రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు సారధ్యంలో పరవాడ మండల టీడీపి నాయకులు శుక్రవారం పరవాడ ఎంపీడీవో హేమ సుందరరావుకి వినతి పత్రం అందజేసారు.ఈ సందర్భంగా బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ పెన్సన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో పెన్సనర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఇంట్లో ఒకరికి మాత్రమే పెన్సన్ ,ఏ నెల పెన్సన్ ఆ నెలలోనే తీసుకోవాలంటూ పెన్సన్లను ఏరివేసే కార్యక్రమాన్ని చేపట్టి వారికి అన్యాయం చేస్తున్నారని మండి పడ్డారు. భర్తను కోల్పోయిన,వితంతువులు,వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రులు గాని,అత్తమామలు గాని ఉంటే ఎవరో ఒకరికే పెన్సన్ అనడం చాలా దుర్మార్గం అని, వైద్యం కోసం ఆస్పత్రిలో ఉన్న వాళ్లు,కూలి పనులకోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన వారు,విద్య,ఉద్యోగాల కోసం పట్టణాలకు,నగరాలకు వెళ్ళిన పిల్లలను చూడటానికి వెళ్ళినవారు,గత నెలలో పెన్సన్ అందుకోనివారికి ఆ పెన్సన్ సొమ్ము ఈ నెలలో ఇవ్వకుండా ద్రోహం చేస్తున్నారని,తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెన్సన్ ఇచ్చే సమయానికి పెన్సన్ దారుడు లేకున్నా తర్వాతి నెలలో రెండు నెలలకు సంబందించిన పెన్సన్ అందించడం జరిగిందని,కొన్నిసార్లు స్థానిక వీఆర్వో,గ్రామ కార్యదర్శుల అనుమతితో మూడు నెలల పెన్సన్ ఒకేసారి ఇచ్చిన సందర్భాలున్నాయని గుర్తు చేసారు. ఒక ఇంట్లో ఒకరికే పెన్సన్ ,ఏనెల పెన్సన్ ఆనెల అనే నిర్ణయాలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, మరోవైపు అవ్వ తాతలకు రూ. 3000 పెన్సన్ ఇస్తానన్న హామీకి రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడిచిందని, అధికారంలోకి రాగానే ప్రతీ ఏటా రూ.250 చొప్పున పెన్సన్ పెంచుకుంటూ పోతామని చెప్పిన ముఖ్యమంత్రి మరో సంవత్సరం వచ్చినప్పటికీ పెన్సన్ పెంచలేదని,రెండో ఏడాది రూ.250, ఈ సంవత్సరం జూలై నుండి రూ.2750 చొప్పున పెన్సన్ ఇవ్వాల్సి ఉన్నప్పటికి ఇంకా రూ2250 మాత్రమే అందిస్తున్నారని,ఇచ్చిన మాట ప్రకారం పెన్సన్ మొత్తాన్ని పెంచకపోవటంతో ఒక్కో వృధ్ధుడుకి రూ.20250 చొప్పున ఎగనామం పెట్టారని ఈ సందర్భంగా దుయ్యబట్టారు. అదేవిదంగా అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగుల పెన్సన్ రూ.5000 చేస్తామన్న హామీని కూడా వెంటనే అమలు చేయాలని,పెన్సన్ పొందుతున్న వృధ్ధుల్ని మోసం చేసినందుకు ప్రతీ ఒక్కరికీ ముఖ్యమంత్రి క్షమాపన చెప్పాలని,తొలగించిన పెన్సన్లను వెంటనే పునరుద్ధరించాలని లేదంటే పెన్సనర్ల తరపున రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి తెలుగుదేశంపార్టీ పూనుకుంటుందని ఈ సందర్భంగా బండారు అప్పలనాయుడు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాస వరపు అప్పలనాయుడు,జెడ్పీటీసి అభ్యర్థి అట్టా సన్యాసిఅప్పారావు, మండలపార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా, మండల కార్యదర్శి ఇందల కొండలరావు, బొండా సన్నిదేముడు ,మాజీ సర్పంచ్ లు కూండ్రపు సన్యాసినాయుడు,బొండా తాతారావు,బంధం వెంకటరమణ,మాజీ ఎంపీటీసి కూండ్రపు శ్రీరాం మూర్తి,స్థానిక నాయకులు సాలాపు గోవింద, ఒమ్మి వెంకటరమణ,పైల సింహాద్రిరావు,పైల చిన అక్కునాయుడు మండలంలో గల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లోకులగాంధీ మరణం పార్టీకి, గిరిజనులకు తీరని లోటు

- శరభన్నపాలెంలో సంతాప సభ - హాజరైన ప్రముఖులు, జాతీయ బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న జాతీయ నాయకులు

కొయ్యూరు : లోకుల గాంధీ మరణం బిజెపి పార్టీకి, గిరిజనులకు తీరని లోటు అని జాతీయ సహ సంఘటన మంత్రి శివప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని శరభన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ప్రముఖులు, జాతీయ నాయకులు హాజరయ్యారు. అనంతరం కేంద్ర పార్లమెంట్ వ్యవహారాల శాఖమంత్రి, ఆంధ్రప్రదేశ్ బిజెపి పార్టీ ఇంచార్జ్ మురళీధరన్ హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసే లోకుల గాంధీ మరణం పార్టీకి, గిరిజన ప్రాంతానికి తీరనిలోటన్నారు. మొదటిసారిగా లోకుల గాంధీని చూసినప్పుడు ఈయన లోకల గాంధీ కాదు లోకల్ గాంధీ అనే ఆరోజు చెప్పానని గుర్తు చేశారు. కేంద్ర మాజీ మంత్రి, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ గిరిజన ప్రాంతం నుండి మొట్టమొదటి ఐఐటి చేసి విదేశాలలో ఉద్యోగం చేస్తూ ప్రజాసేవ చేయాలనే తపనతో బిజెపి పార్టీలో అతి చిన్న వయసులోనే చురుకైన పాత్ర పోషించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి పొందడం ఆయన పనితనానికి నిదర్శనమన్నారు. జాతీయ నాయకుడిగా ఈ క్రమంలో మన అందరి నుండి దూరం అవ్వడం పార్టీకి, మన్య ప్రాంతానికి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యసభ ఎంపీ జివిఎల్. నరసింహారావు మాట్లాడుతూ గాంధీ జిల్లా రాష్ట్ర జాతీయ నాయకుల హృదయాలలో అతి తక్కువ కాలంలో చిరస్మరణీయంగా నిలిచిన వ్యక్తి గాంధీ అన్నారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడుతూ గాంధీ మరణం పార్టీకి తీరని లోటని కుటుంబానికి మన ప్రాంతానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పరోక్షంగా కుటుంబంలో ఒకరికి పార్టీలో సముచిత పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. అరకు జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శి రాజారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ మాధవ్, జాతీయ కార్యదర్శి సత్యకుమార్, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి సత్యకుమార్, కురచ ఉమామహేశ్వరరావు, కొయ్యూరు మండల అధ్యక్షుడు మురికుర్తి అప్పలరాజు, వివిధ మండలాల నుండి అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నివాళ్ళు అర్పిస్తున్న దృశ్యం

# మజ్జివలస, బూర్జ రోడ్డు నిర్మాణం తక్షణమే చేపట్టాలి

## జనసేన పార్టీ జన సైనికుడు ఎంపీటీసీ దురియా సాయిబాబా

అనంతగిరి : అరకు లోయ నియోజకవర్గం, విశాఖ ఏజెన్సీ ప్రాంతమైన హుకుంపేట మండలం బూర్జ మజ్జివలస మజ్జివలస నుంచి బూర్జ వరకు గత ప్రభుత్వంలో తారు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సుమారు 5 కోట్ల రూపాయల వరకు మంజూరు అయినది అయితే ఈ నిర్మాణం చేపట్టేందుకు కాంటాక్ట్ కె సంబంధిత అధికారులు అప్పజెప్పారు అయితే నేటికి ఐదు సంవత్సరాలు అవుతున్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ ఆ పనులు పూర్తి చేయకపోవడంతో రాకపోకల వాహన చోదకులు చాలా ఇబ్బంది పడుతున్నారు అయితే పనులు చేపట్టి ఇ దీనికి సంబంధించిన బిల్లులు మార్చినట్టు ఆరోపణలు వస్తున్న ఈ పరిస్థితిని గమనించిన జనసేన పార్టీ జన సైనికుడు ఎక్స్ ఎంపిటిసి సాయిబాబా .దురియా శుక్రవారం ఆయా గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో సమావేశం మై రోడ్డు కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకోవడం అయినది అయితే సంబంధిత కాంట్రాక్టు రోడ్డు నిర్మాణ పనులు . ఆర కూర పనులు చేస్తూ నాణ్యత లేని పనులు చేపడుతూ, బిల్లుల మార్చుకున్నట్టు మాకు అనుమానాలు అనుమానాలు కలుగుతున్నాయని వీటిపై సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని జనసేన పార్టీ దృష్టికి తీసుకురావడం అయినది ఈ సందర్భంగా జనసేన పార్టీ జన సైనికుడు సాయిబాబా స్పందిస్తూ తక్షణమే నాణ్యత గల తారు రోడ్డు నిర్మాణాలు జరగాలని సంబంధిత కాంట్రాక్టర్ దీనిపై చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని చేయలేని పక్షంలో దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్తామని వారితో సూచించడం జరిగింది అయితే వీటిపై ప్రభుత్వం స్పందించి నాణ్యతలేని రోడ్డు నిర్మాణాలు చేపడుతూ న్న కాంట్రాక్ట్ పై తక్షణమే విచారణ జరిపించి అతనిపై చర్య తీసుకోవాలని ఇదివరకు పాక్షికంగా పనులు చేపడుతూ బిల్లులు మార్చుకున్న కాంట్రాక్ట్ పై తక్షణమే విచారణ జరిపించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగింది అనంతరం ఆయా గ్రామ ప్రజలతో కలిసే మజ్జివలస గ్రామంలో నాణ్యతలేని బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించడం జరిగినది.

అనంతరం తక్షణమే తారు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టి పనులు పూర్తి చేయాలని నాణ్యతగల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వం దీనిపై సంబంధిత అధికారులతో విచారణ జరిపించాలని జనసేన పార్టీ ఆధ్వర్యంలో లో ఆయా గ్రామస్తులతో చేపడుతూ నినాదాలతో కిలోమీటరు దూరం వరకు నిరసన తెలిపారు అనంతరం నెల క్రితం ఆక్సిడెంట్ లో గాయం అయినటువంటి పూజ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ పరసురం వారి ఇంటి వద్దకు వెళ్ళి అతని గాయాన్ని పరిశీలిస్తూ అతనితోపాటు వారి కుటుంబానికి పరామర్శించడం అయినది ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్ పరశురామ్ ఎంపిటిసి అభ్యర్థి బుద్దు ఆయా గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

# తరిగిపోతున్న వృక్ష సంపదను కాపాడుకోవాలంటూ అవగాహన

గొలుగొండ : గొలుగొండ మండలం ఎర్రవరం గ్రామంలో జీవవైవిద్యం పరిరక్షణ అనే అంశంపై ఎర్రవరం పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం ఎం.రమేష్ మాట్లాడుతూ తరిగిపోతున్న వృక్ష సంపదను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరు వృక్ష సంపదను కాపాడుకొనుటలో భాగస్వామ్యం కావాలన్నారు. ఎక్కువ విద్యార్థుల దశ నుండి పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి ప్రసాదించిన వనరులపై దృష్టిసారించాలన్నారు. గొలుగొండ ఎంబిసి ఎన్.త్రిమూర్తులు మాట్లాడుతూ ఎక్కువగా విత్తనాలు, విత్తన బ్యాంకులు అభివృద్ధి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ గురించి విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రతీ కుటుంబం విరివిగా ఇంటి ఆవరణలో, పొలాల గట్లపై మొక్కలు నాటాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిద్య మండల వారి ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు సత్తిబాబు,అప్పలరాజు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ హిత నగరంగా విశాఖ

## - నగర మేయర్ గొలగాని హర వెంకట కుమారి



విశాఖపట్నం : పర్యావరణ హిత నగరంగా మన విశాఖను తీర్చి దిద్దాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో పాత డైరీఫారం ఎసిబి ఆఫీసు సమీప ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంనకు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని మేయర్ అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ వారు దేశంలో పర్యావరణ పరిరక్షణకు ఎంతో కృషి చేస్తున్నారని, దేశంలో అన్ని రాష్ట్రాలలో, క్రేంద్రపాలిత ప్రాంతాలలో కూడా "క్రోకేర్" కార్యక్రమం ద్వారా మొక్కలు నాటుతున్నారని, అందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. మరి కొన్ని సామాజిక సంఘాలు, నివాసిత సంక్షేమ సంఘాలు ముందుకు వచ్చి ఇటువంటి మొక్కలు నాటే పలు కార్యక్రమాలు చేపట్టాలని మేయర్ తెలిపారు. ప్రతి చోటా చెట్లను నరికివేయకుండా..., పచ్చదనం పెంపొందించడం కోసం, కాలుష్య నివారణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని ఆమె సూచించారు. అందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించగలిగితేనే మానవ మనుగడ సాధ్యపడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఫర్ కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ వికాస్ పాండే తదితర ప్రతినిదులు పాల్గొన్నారు.

# సింహాద్రి నాధుని సేవలో ఎంపీ విజయసాయి రెడ్డి

## రూ.300 టిక్కెట్ తో స్వామి దర్శనం, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ప్రారంభించిన ఎంపీ



సింహాచలం : సింహగిరి కొండపై వేంచేసియున్న శ్రీ సింహాద్రి నాధున్ని వైఎస్సార్సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి శుక్రవారం నాడు దర్శించుకున్నారు దర్శనానికి 300రూ ల టిక్కెట్ తీసుకోగా ఆలయానికి చేరుకున్న ఆయన దేవస్థానం ఈ ఓ సూర్యకల మంగళవాయిద్యాలు నడుమ వేదమంత్రాలు నడుమ పూర్ణకుంభ స్వాగతం పలుకగా కప్పస్థంబ ఆలింగనం అనంతరం అంతరాలయంలో సీఎం పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం బేడా మండపంలో వైదికులు వేధ ఆశీర్వచనం పలుకగా ఈఓ స్వామి వారి చిత్ర పటం ప్రసాదాలు అందజేశారు అనంతరం స్వామి వారి కళ్యాణమండపం మ్యూజియం వీక్షించారు అనంతరం శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సామూహిక వరలక్ష్మీ వ్రతాలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసీపీ నాయకులు ట్రస్టు బోర్డు సభ్యులు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.









# దోమల నివారణే ప్రధాన ధ్యేయం

## - జివిఎంసి కమిషనర్ డాక్టరు జి.సృజన



విశాఖపట్నం : మహా విశాఖ నగర పరిధిలో దోమలను నివారించుటకు మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను అరికట్టుటకు మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని జివిఎంసి కమీషనర్ డాక్టర్ జి. సృజన పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ, నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా మలేరియా, డెంగ్యూ వ్యాధులను అరికట్టుటకు నగర పరిధిలో దోమల నివారణే ప్రధాన ధ్యేయంగా జివిఎంసి అన్ని రకాల చర్యలు చేపట్టిందన్నారు. అందుకు ప్రతీ రోజూ జివిఎంసి ఇంటింటా సర్వే నిర్వహణ జరుగుతుందన్నారు. ఈ సీజనల్ వ్యాధులు విస్తృతం కాకుండా ముందస్తు చర్యలైన పరిసరాల పరిశుభ్రత ద్వారా ప్రతీ ఇంటా దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తుంచి నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ చర్యలలో సంబందిత అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు, మలేరియా సిబ్బంది ద్వారా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. నగర ప్రజలు తమ వంతు బాధ్యతగా జివిఎంసి సిబ్బందికి సహకరిస్తూ, ప్రతీ శుక్రవారం "డ్రై డే" ను విధిగా పాటించి దోమల నివారణ చర్యలకు బాధ్యత వహించాలని కమిషనర్ కోరారు. ముఖ్యంగా మంచినీటి నిల్వలలోనే దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయని ప్రజలు గమనించాలన్నారు. వారానికొకసారి తప్పనిసరిగా వాటర్ ట్యాంకులలో నీటి నిల్వలను ఖాళీ చేసి, ఆరబెట్టి తాజాగా నీటిని నింపుకోవాలని కమిషనర్ తెలిపారు.

# ఏపీ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించారు

## ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్

గుంటూరు: ఆంధ్రప్రదేశ్‌లో సంచలనంగా మారిన బీటెక్ విద్యార్థిని రమ్య హత్య ఘటన దురదృష్టకరమని ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... హత్య కేసులో పోలీసులు వెంటనే స్పందించారని తెలిపారు. నిందితుడు శశికృష్ణను అరెస్టు చేసే సమయంలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఏపీ పోలీసులు స్పందించిన తీరుపై ఎస్సీ కమిషన్ సైతం ప్రశంసించిందని అన్నారు. కాగా, వార్తలు ప్రచురించే విషయంలో తొందరపాటు వద్దని పేర్కొన్నారు.

# 'జగనన్న వైఎస్సార్ బడుగు వికాసం' పథకంతో మా జీవితాల్లో వెలుగు



అమరావతి: ఏపీలోని వివిధ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఎంట్రప్రెన్యూర్స్‌తో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా తాడికొండకు చెందిన మైక్రో ఎంట్రప్రెన్యూర్ వీర వర్ధిణి మాట్లాడుతూ.. 'జగనన్న వైఎస్సార్ బడుగు వికాసం' పథకం కింద అందించే సబ్సిడీ పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో హెచ్‌పీసీఎల్ ఎల్‌పీజీ ట్యాంకర్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే దీనికి రూ. 44 లక్షల వరకు ఖర్చు అయినట్లు పేర్కొన్నారు.

అయితే యూనియన్ బ్యాంక్ నుంచి రూ. 38 లక్షల వరకు లోన్ పొందినట్లు చెప్పారు. కాగా ఇందులో సబ్సిడీ కింద రూ.19.75 లక్షల ప్రభుత్వం నుంచి అందించినట్లు పేర్కొంది.

ఈ విధమైన పోత్రాహకాలు అందిచడం, ఎస్సీ, ఎస్టీ మహిళలను ప్రభుత్వం ప్రోత్సహించడం సంతోషంగా ఉందన్నారు.

# దిశా యాప్ పై అవగాహన కల్పించాలి

## - హెూం మంత్రి సుచరిత ని కలిసిన మహిళా నేత పేడాడ



విశాఖ సిటీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూంమంత్రి మేకతోటి సుచరితని మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్ఆర్ సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణి కుమారి.దిశా యాప్,మహిళ సాధికారక అంశాలపై చర్చించారు. దిశాయాప్ మహిళ రక్షణకు ఆయుధంగా ఉపయోగపడుతుందని,మహిళకు దిశా యాప్ పై అవగాహన కల్పించాలని హెూంమంత్రి మేకతోటి సుచరిత,పేడాడ రమణి కుమారి ని ఆదేశించారు.

# పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వండి

## జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు



విశాఖపట్నం : వర్షాలు ప్రారంభమై నందున గ్రామాలలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత నివ్వాలని సంయుక్త కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. ఆయన పద్మనాభం మండలంలో రేవిడి కృష్ణాపురం పద్మనాభం అనంతవరం గ్రామాలలో పర్యటించి సచివాలయాలను తనిఖీ చేశారు. వానలకు మురుగునీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతాయని ఫలితంగా మలేరియా ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి నీరు నిల్వ ఉండకుండా సంపూర్ణ పారిశుద్ధ్యం ప్రతిరోజూ చేస్తూ ఉండాలన్నారు. అందరూ కోవిడ్ నిబంధనలను పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ ఉద్యోగులందరూ సమయపాలన, బయోమెట్రిక్ తప్పనిసరిగా పాటించాలని, సంక్షేమ పథకాలకు సంబంధించిన చెల్లింపులకు రసీదులను వెంటనే పంపించాలన్నారు. వైయస్సార్ భీమాలో అర్హులందరినీ నమోదు చేయాలన్నారు. స్పందన కార్యక్రమం తప్పక నిర్వహిస్తూ ఉండాలన్నారు. రైతు భరోసా కేంద్రాలు, వెల్ నెస్ క్లినిక్ లు, బల్క్ మిల్క్ కేంద్రాలు, ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో మండల అభివృద్ధి అధికారి జి.వి. చిట్టిరాజు, మండల ఇంజనీర్ సుధాకర్ రావు, ఈ.వో.ఆర్.డి. ఎన్. ఉషారాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గీతం విద్యార్థినికి ఎడోబ్ భారీ నజరాన

## రూ. 40.92 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం



సాగర్‌నగర్ : ప్రాంగణ నియామకాలకు పెట్టింది పేరైన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఇంజనీరింగ్ నాలుగవ ఏడాది చదువుతున్న విద్యార్థినికి ప్రముఖ ఐటి కంపెనీ ఎడోబ్ భారీ వేతనంతో ఉద్యోగాన్ని ఆఫర్ చేసింది. గీతంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చదువుతున్న నాలుగవ సంవత్సరం విద్యార్థిని ప్రియాంక నాయర్‌కు ఎడోబ్ కంపెనీ సాఫ్ట్‌వేర్ డవలప్‌మెంట్ ఇంజనీర్‌గా రూ. 40.92 లక్షల వార్షిక వేతనంతో పాటు అదనంగా 12 లక్షల విలువైన వేతన సదుపాయాలు కల్పిస్తూ ఎంపిక చేసుకుందని గీతం కెరీర్ గైడన్స్ సెంటర్ డైరక్టర్ శ్రీరామ్ తెలిపారు.ఎడోబ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో కోడింగ్ పరీక్షతో పాటు వివిధ దశలలో జరిగిన సాంకేతిక ఇంటర్వ్యూలను, ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను సహితం ఎదుర్కొని ఈ ఉద్యోగాన్ని సాధించిందని ఆయన పేర్కొన్నారు. ఎడోబ్ సంస్థలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన ప్రియాంక నూతన టెక్నాలజీల పై తనకు గల ఆసక్తి, గీతం కెరీర్ గైడన్స్ సెంటర్ అందించిన శిక్షణ తన విజయానికి కారణమని ప్రియాంక తెలిపారు. ఇంత మొత్తంలో వేతనం లభించడం రాష్ట్రంలో ఇదే ప్రధమం కావడం విశేషం. ఈసందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ శుక్రవారం తేదీ:03-09-2021న ప్రియాంక నాయర్‌ను, అమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.

VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com